# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

12.03.2026 గురువారం Thursday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 231 | పేజీలు : 12 Pages : 12 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944

7897222788 - 7897222789




## అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా

# రవాణా వ్యవస్థ

### ట్రాఫిక్ ఫ్రీ హైదరాబాద్‌గా మార్పు

- తెలంగాణ రూపురేఖలు మార్చేలా రవాణా, వైద్యరంగం అభివృద్ధి
- 'రోడ్ సెక్టార్ పాలసీ-2047' లక్ష్యంగా ఆదేశాలు
- హైదరాబాద్ నుంచి రోడ్డు కనెక్టివిటీ పెంచాలి
- రోడ్ల విస్తరణ పనులు త్వరగా చేపట్టాలి
- రాష్ట్రంలోని ప్రధాన జిల్లా కేంద్రాలన్నింటికీ ఒక రింగ్ రోడ్డు
- నిర్మాణంలో ఉన్న ఆస్పత్రులను త్వరగా పూర్తి
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశం



## తెలంగాణ గవర్నర్‌గా శివప్రతాప్

### రాజ్‌భవన్‌లో తెలుగులో ప్రమాణం

### సీఎం రేవంత్ తదితరుల హాజరు

తెలంగాణ నూతన గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా ప్రమాణ స్వీకారం చేశారు.. తెలుగులో ప్రమాణం చేయడం ఆసక్తిగా మారింది. లోక్‌భవన్‌లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణస్వీకారం చేయించారు.

వివరాలు 3లో..

**నేటి సాక్షి, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా రవాణా, వైద్య రంగాల్లో భారీ మార్పులకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. రాబోయే రెండు దశాబ్దాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 'రోడ్ సెక్టార్ పాలసీ-2047' లక్ష్యంగా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి సీఎం రవాణా, ఆరోగ్య రంగాలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలోని రవాణా వ్యవస్థను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరం నుంచి రాష్ట్రంలోని ఏ ప్రాంతానికైనా నిర్ణీత సమయంలో చేరుకునేలా రోడ్ల నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు.

మిగతా 3 లో

## దానం, కడియంకు

# బిగ్ రిలీఫ్

### అనర్హత పిటిషన్లు కొట్టివేసిన స్పీకర్



- వారంతా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే
- పార్టీ మారినట్లు ఆధారాల్లేవు
- సుప్రీంకోర్టు విచారణకు ఒకరోజు ముందే స్పీకర్ గడ్డం ప్రసాద్ తుది తీర్పు

3

## కేసీఆర్ క్షమాపణ చెబితే

# రాజీనామా

### కడియం శ్రీహరి సవాల్

3

## ప్రజాస్వామ్యంపై

# బహిరంగ దాడి

### కడియం, దానంకు క్లీన్‌చిట్‌పై కేటీఆర్

ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరికి శాసనసభాపతి క్లీన్ చిట్ ఇవ్వడం ప్రజాస్వామ్యంపై బహిరంగ దాడి అని కేటీఆర్ మండిపడ్డారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ స్పీకర్ తీసుకున్న ఈ నిర్ణయం ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజుగా అభివర్ణించారు.

3

# స్పీకర్‌పై వీగిపోయిన అవిశ్వాస తీర్మానం

- లోక్‌సభలో విపక్షాలపై అమిత్ షా ఫైర్
- పార్లమెంటరీ రాజకీయాల్లో ఇదో దురదృష్టకర ఘటన అని వ్యాఖ్యలు



లోక్‌సభలో స్పీకర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం మూజువాణి ఓటుతో వీగిపోయింది. అయితే ఈ ఓటింగ్‌కు ముందు అధికార, ప్రతిపక్షాలు ఒకరి మీద ఒకరు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించుకున్నారు. ముఖ్యంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు చేశారు. గతంలో రాహుల్ గాంధీ మోదీని కౌగిలించుకుని, తరువాత కన్ను గీటడం లాంటి చర్యలను గుర్తుచేశారు. దీనితో విపక్షాలు అమిత్ షాపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

4

# యుద్ధంపై రాజకీయాలా



- గల్ఫ్‌లో చిక్కుకున్న భారతీయులందరినీ క్షేమంగా తీసుకొస్తాం
- కేరళ పర్యటనలో కాంగ్రెస్, వామపక్షాల తీరుపై మోదీమండిపాటు

4



## అమెరికా ఆర్థిక సంస్థలపై

# దాడులు చేస్తాం

- ఇరాన్ సంచలన హెచ్చరిక
- టెక్ దిగ్గజాలపై దాడులకు సిద్ధమంటూ ప్రకటన
- గూగుల్, మైక్రోసాఫ్ట్ సంస్థలకు వార్నింగ్
- టెహ్రాన్ బ్యాంకుపై ఇజ్రాయెల్ దాడికి ప్రతీకారం
- హోర్ముజ్ జలసంధి మూసివేతతో భారత్‌కు చమురు సెగ

.. వివరాలు 4లో

## వెలుగుమట్లలో

# మోడల్ కాలనీ

- డిసెంబర్ 9న సామూహిక గృహప్రవేశాలు
- పేదల కలను నిజం చేస్తున్న ప్రజా ప్రభుత్వం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- 412 మంది బాధితులకు ఇళ్ల పట్టాల పంపిణీ
- రూ. 22,500 కోట్లతో లక్ష్యం సాకారం

3





## మహిళల ఆరోగ్యంపై

# సర్కార్ భరోసా

'ఉమెన్ వెల్‌నెస్'లో నిర్లక్ష్యం వద్దు : దామోదర

3



# విరిగిన విమాన ల్యాండింగ్ గేర్

## రన్‌వేపై థాయి విమానానికి తప్పిన ముప్పు

**హైదరాబాద్, మార్చి 11:** సాంకేతిక సమస్య, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా తరచూ విమాన ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల మహారాష్ట్రలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ తో సహా ఐదుగురు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఇది ఇలా ఉంటే.. తాజాగా హైదరాబాద్ నుంచి బయలుదేరిన విమానంకి పెను ప్రమాదం తప్పింది. హైదరాబాద్ నుంచి థాయిలాండ్ బయల్దేరిన ఎయిరిండియా విమానానికి (బోయింగ్ 737) ప్రమాదం తప్పింది. బుధవారం ఫుకెట్ ఎయిర్ ఫోర్టులో ల్యాండ్ అయిన వెంటనే నోస్ వీల్ (ఫ్రంట్ ల్యాండింగ్ గేర్) ఊడిపోయింది. దీంతో విమానం రన్ వే నుంచి పక్కకు జారింది. వెనుక టైర్ కూడా పేలిపోయింది. ఈ ఘటన జరిగిన సమయంలో విమానం తక్కువ వేగంతో ఉండటంతో భారీ ప్రమాదం తప్పింది. ఈ విమానంలో ఉన్న 133 మంది ప్రయాణికులు క్షేమంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

# ఆస్కార్ వేడుకకు రంగం సిద్ధం

## 15న సాయంత్రం ప్రత్యక్ష ప్రసారం



**లాస్ ఏంజిల్స్, మార్చి 11:** ప్రపంచ సినీ ప్రియులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే అతి పెద్ద వేడుక 'ఆస్కార్స్ 2026' 98వ అకాడమీ అవార్డ్స్ కు సర్వం సిద్ధమైంది. 2025లో విడుదలైన ఉత్తమ చిత్రాలు, నటీనటులు, సాంకేతిక నిపుణులకు పురస్కారాలు అందించేందుకు లాస్ ఏంజెల్స్ లోని డాల్బీ థియేటర్ సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. అగ్రశ్రేణి హాలీవుడ్ తారలు, ప్రతిభావంతులైన దర్శకులు, నిర్మాతలు ఒకే వేదికపై సందడి చేయనున్నారు. ఈ ఏడాది ఆస్కార్ వేదికపై భారతీయ నటి ప్రియాంక చోప్రా కూడా ప్రెజెంటర్‌గా వ్యవహరించనున్నారు. రాబర్ట్ డౌనీ జూనియర్, అన్నే హాత్‌వే, గ్వినేత్ పాల్ట్రో, పాల్ మెస్కల్ వంటి ప్రముఖ స్టార్స్‌తో కలసి ఆమె వేదికపై అవార్డులను ప్రదానం చేయనున్నారు. 98వ అకాడమీ అవార్డ్స్ ఈనెల 15న ఆదివారం అమెరికా కాలమానం ప్రకారం సాయంత్రం 7 గంటలకు లాస్ ఏంజెల్స్‌లోని ప్రఖ్యాత డాల్బీ థియేటర్‌లో అట్టహాసంగా జరగనున్నాయి. కాల వ్యత్యాసం కారణంగా భారతదేశంలో ఈ వేడుకలను మార్చి 16 సోమవారం వేకువ ఝామున 4:30 గంటల నుంచి వీక్షించవచ్చు. తారల తళుకులతో రెడ్ కార్పెట్ ఈవెంట్ ప్రారంభమవుతుంది. ఆ తర్వాత అవార్డుల ప్రదానోత్సవం మొదలవుతుంది. ప్రముఖ హాస్యనటుడు, టెలివిజన్ వ్యాఖ్యాత కోనన్ ఓబ్రియన్ వరుసగా రెండో ఏడాది కూడా ఈ వేడుకలకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు. భారతీయ ప్రేక్షకులు ఆస్కార్స్ వేడుకలను డిజిటల్, టెలివిజన్ ప్లాట్‌ఫామ్‌లలో వీక్షించవచ్చు. స్టార్ మూవీస్‌లో ఉదయం 4:30 గంటల నుంచి ప్రత్యక్ష ప్రసారం అవుతుంది. ఉదయం చూడలేని వారి కోసం అదే రోజు రాత్రి ఈ వేడుకను పునః ప్రసారం చేయనున్నారు. అలాగే జియో హాట్‌స్టార్ యాప్‌లోనూ ప్రత్యక్ష ప్రసారం అవుతుంది.

# త్వరలో ఇరాన్‌తో యుద్ధం ముగిస్తాం: ట్రంప్

**వాషింగ్టన్, మార్చి 11:** ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య యద్ధం భీకరంగా సాగుతున్న వేళ.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలో ఇరాన్‌తో యుద్ధం ముగియవచ్చున్నారు. అమెరికా దళాలు ఇప్పటికే టెహ్రాన్ సైనిక సామర్థ్యాలపై భారీ నష్టాన్ని కలిగించాయని చెప్పారు. యుద్ధం జరుగుతుందని పేర్కొన్నారు. అనుకున్న సమయం కంటే చాలా ముందున్నామన్నారు. ఆరు వారాల్లో అనుకున్నదాని కంటే అధిక నష్టాన్ని కలిగించామని చెప్పారు. ఇప్పటికే ఇరాన్‌లోని అన్ని లక్ష్యాలనూ ఛేదించామని తెలిపారు. ఇరాన్ వద్ద ఇంకేమీ మిగల్లేదని వెల్లడించారు. తాను ఎప్పుడనుకుంటే అప్పుడు ఈ యుద్ధం ఆగుతుందని ఈ సందర్భంగా ట్రంప్ స్పష్టం చేశారు. బుధవారం ఒక ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.

# 10మంది మావోల లొంగుబాటు

**ఒడిశా, మార్చి11:** దేశంలో మావోయిస్టుల నిర్మూలన కోసం కేంద్రం నిర్దేశించుకున్న లక్ష్యం సాకారం కానుంది. ఒడిశాలోని కంధమాల్ జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఎదుట పలువురు మావోయిస్టులు లొంగిపోయారు. బుధవారం ఉదయం జిల్లా ఎస్పీ ఎదుట 10 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వారిలో నీతూ కూడా ఉన్నారని జిల్లా ఎస్పీ వెల్లడించారు. మావోయిస్టు పార్టీ స్టేట్ కమిటీ సభ్యురాలు ఆమె కొనసాగుతున్నారని చెప్పారు. వీరిపై మొత్తం రూ.1.65 కోట్ల రివార్డు ఉందని ఎస్పీ వివరించారు. 2026, మార్చి 31వ తేదీ నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించాలని కేంద్రం ఆపరేషన్ కగార్‌ను చేపట్టింది. కేంద్రం నిర్దేశించుకున్న లక్ష్యం మరికొద్ది రోజుల్లో ముగియనుంది. దేశంలో ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశాలలో మాత్రమే మావోయిస్టుల ప్రభావం ఉంది. ఛత్తీస్‌గఢ్‌లో వీరి ప్రభావం అధికంగా ఉండడంతో.. పోలీసులతోపాటు కేంద్ర భద్రతా బలగాలు నిరంతరాయంగా కూంబింగ్ నిర్వహించాయి. దీంతో ఈ రాష్ట్రంలో భారీగా ఎన్‌కౌంటర్లు జరిగాయి. దీనిలో వందలాది మంది మావోయిస్టులు మరణించారు. అలాగే భారీగా మావోయిస్టులు ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. పలువురు మావోయిస్టులను అరెస్ట్ చేశారు. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లో పోలీసుల కూంబింగ్ పెరగడంతో.. ఆ రాష్ట్రానికి సరిహద్దులుగా ఉన్న జార్ఖండ్, ఒడిశాలోకి ప్రవేశించారు. ఆయా రాష్ట్రాల్లో సైతం పోలీసులు కూంబింగ్ చేపట్టడంతో.. వారంతా పోలీసుల ఎదుట లొంగిపోవడం మినహా గత్యంతరం లేని పరిస్థితి నెలకొంది. ఇంకోవైపు తెలంగాణ ప్రభుత్వం ఎదుట పలువురు మావోయిస్టు పార్టీ అగ్రనేతలు లొంగిపోయిన విషయం విదితమే. ఆపరేషన్ కగార్ ద్వారా నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు కేంద్రం వడివడిగా అడుగులు వేస్తోంది.



# కేంద్రమాజీమంత్రి కావూరి మృతి

- అనారోగ్యంతో చికిత్స పొందుతూ మరణం
- కావూరి మృతిపై చంద్రబాబు తదితరుల సంతాపం



**హైదరాబాద్, మార్చి 11:** తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో సుదీర్ఘ కాలం పాటు తనదైన ముద్ర వేసిన సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు (82) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. కావూరి సాంబశివరావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అత్యంత ప్రభావవంతమైన నేతల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. ఎంపిగా, కేంద్రమంత్రిగా పనిచేశారు. మన్మోమన్ కేబినేట్‌లో మంత్రిగా పనిచేశారు. ఆయన మృతి పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కావూరి మరణం రాజకీయ రంగానికి తీరని లోటుగా పలువురు నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఏపీ మంత్రి నారా లోకేశ్, పలువురు నేతలు కావూరి సాంబశివరావు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. కావూరి సాంబశివరావు మృతిపట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి అత్యంత బాధాకరమని తెలిపారు. మచిలీపట్నం, ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి ఐదుసార్లు ఎంపీగా గెలిచి, కేంద్రమంత్రిగా పనిచేసిన కావూరి సాంబశివరావు మరణం తీరని లోటని పేర్కొన్నారు. రాజకీయ, వ్యాపార రంగంలో కావూరిది ప్రత్యేక ముద్ర అని కొనియాడారు. ఈ విషాద సమయంలో వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నానని సీఎం చంద్రబాబు తెలిపారు. కావూరి సాంబశివరావు మృతి పట్ల కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. మాజీ కేంద్రమంత్రి, బీజేపీ నేత కావూరి సాంబశివరావు అనారోగ్యంతో కన్నుమూశారని తెలిసి విచారం వ్యక్తం చేస్తున్నానని అన్నారు. ఐదుసార్లు ఎంపీగా, కేంద్రమంత్రిగా వారు ప్రజాసేవకు జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు. రాజకీయంలో వారికున్న సుదీర్ఘ అనుభవంతో.. ప్రజాసమస్యలపై పార్లమెంటు లోపలా, బయటా తన గళాన్ని వినిపించారని ప్రశంసించారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని ప్రార్థిస్తూ.. వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. కావూరి సాంబశివరావు మృతిపట్ల మంత్రి నారా లోకేశ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కావూరి సాంబశివరావు మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. ఐదుసార్లు ఎంపీగా గెలిచి, కేంద్రమంత్రిగా పనిచేసి రాష్ట్ర ప్రగతి కోసం ఎనలేని కృషి చేశారని కొనియాడారు. తన నియోజకవర్గ అభివృద్ధిలో చెరగని ముద్ర వేశారని ప్రశంసించారు. కావూరి సేవలు చిరస్మరణీయమని అన్నారు. వారి ఆత్మకు శాంతి కలగాలని దేవుడిని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తున్నానని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. కావూరి సాంబశివరావు మరణం పట్ల కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ప్రజాసేవ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ధీశాలి కావూరి అని కొనియాడారు. పార్లమెంటులో ప్రజా సమస్యలపై నిరంతరం గళం వినిపించిన గొప్ప నాయకుడు కావూరి అని ప్రశంసించారు. ఆయన మరణం తెలుగు రాష్ట్రాల రాజకీయాలకు, ముఖ్యంగా బీజేపీ కుటుంబానికి తీరని లోటని భూపతిరాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. కావూరి సాంబశివరావు మృతికి మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి సంతాపం వ్యక్తం చేశారు. కావూరి మరణం అత్యంత బాధాకరమని అన్నారు. కావూరి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని పనబాక లక్ష్మి పేర్కొన్నారు. కావూరి సాంబశివరావు మృతి పట్ల మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం రాష్ట్రానికి తీరని లోటని అన్నారు. రాజకీయ, వ్యాపార రంగాల్లో తనదైన ముద్ర వేసిన గొప్ప నాయకుడు కావూరి అని కొనియాడారు. మచిలీపట్నం, ఏలూరు నుంచి 5 సార్లు ఎంపీగా గెలిచిన నిబద్ధత గల నేతను కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని లగడపాటి రాజగోపాల్ తెలిపారు.

# అమెరికాలో రిలయన్స్ ఆయిల్ రిఫైనరీ


## 300 బిలియన్ డాలర్లతో భారీ ప్రాజెక్ట్
## రిలయన్స్‌తో అమెరికా ప్రభుత్వం ఒప్పందం
## సోషల్ మీడియా ట్రూత్‌లో వెల్లడించిన ట్రంప్



**వాషింగ్టన్, మార్చి 11:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 300 బిలియన్ డాలర్ల చమురు శుద్ధి కర్మాగార ప్రాజెక్టును టెక్సాస్‌లో ప్రకటించారు. ఈ ప్రాజెక్టులో భారతదేశ రిలయన్స్ ఇండస్ట్రీ భాగస్వామి క ఆవడం విశేషం. ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఖాతాలో ఈ ప్రాజెక్టును అమెరికా చరిత్రలో అతిపెద్ద ఒప్పందం గా పేర్కొన్నారు. ఇది అమెరికన్ కార్మికులు, ఇంధన వృద్ధి, దక్షిణ టెక్సాస్ ప్రజలకు భారీ విజయం అని అభివర్ణించారు. ట్రంప్ ప్రకటన ప్రకారం.. ఈ ప్రాజెక్టు దేశీయ ఇంధన ఉత్పత్తిని బలోపేతం చేయడానికి, పారిశ్రామిక పెట్టుబడులను విస్తరించడానికి ఓ ముఖ్యమైన దశగా ఉంటుంది. బ్రౌన్స్‌విల్లే నౌకాశ్రయంలో ఉనికిలో ఉండే అమెరికా ఫస్ట్ రిఫైనింగ్ సంస్థ దీనిని అభివృద్ధి చేస్తుంది. ట్రంప్ ఈ ప్రాజెక్టును ఆర్థిక, వ్యూహాత్మక మైలురాయిగా పేర్కొన్నారు. అయితే, పెట్టుబడి నిర్మాణం, ఖర్చులు లేదా ఆర్థిక వివరాలపై ప్రకటనలో స్పష్టత ఇవ్వలేదు. గత 50 ఏళ్లలో అమెరికా గడ్డపై నిర్మించతలపెట్టిన మొట్టమొదటి రిఫైనరీ ఇదే కావడం విశేషం. ఈ మెగా ప్రాజెక్టులో భారతీయ దిగ్గజ సంస్థ 'రిలయన్స్' కీలక భాగస్వామిగా చేరడం అంతర్జాతీయ వాణిజ్య వర్గాల్లో హాట్ టాపిక్ అయింది. సుమారు 300 బిలియన్ల డాలర్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా అమెరికా-భారత్ మధ్య ఆర్థిక సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయి. ప్రపంచంలోనే అత్యంత పరిశుభ్రమైన మరియు అత్యాధునికమైన రిఫైరీగా దీనిని తీర్చిదిద్దనున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. ఈ డీల్ కుదుర్చుకున్నందుకు రిలయన్స్ యాజమాన్యానికి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతూ, ఈ భాగస్వామ్యం ఇరు దేశాలకు గెలుపు లాంటిదని అభివర్ణించారు. ఈ భారీ ప్రాజెక్టు కేవలం ఇంధన ఉత్పత్తికే పరిమితం కాకుండా, అమెరికా ఇంధన భద్రతను గణనీయంగా పెంచనుంది. దీని ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించడమే కాకుండా, టెక్సాస్ ప్రాంత ఆర్థిక పురోగతికి ఇది కీలకం కానుంది. పర్యావరణ హితంగా ఉండేలా గ్రీన్ టెక్నాలజీని ఉపయోగించి ఇంధనాన్ని శుద్ధి చేయడం దీని ప్రత్యేకత. గతంలో పెట్రోలియం రంగంలో రిలయన్స్‌కు ఉన్న అపారమైన అనుభవం, ముఖ్యంగా జామ్‌నగర్ వంటి అతిపెద్ద రిఫైనరీల నిర్వహణ సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకునే ట్రంప్ యంత్రాంగం ఈ డీల్‌కు మొగ్గు చూపినట్లు కనిపిస్తోంది. ఈ ఒప్పందం వల్ల అమెరికా చమురు దిగుమతుల పై ఆధారపడటం తగ్గి, అంతర్జాతీయ మార్కెట్లో తన పట్టును మరింత బిగించే అవకాశం ఉంది. ఇది అమెరికాలో ఇంధన ఉత్పత్తిని పెంచి, బిలియన్ డాలర్ల ఆర్థిక ప్రభావాన్ని తీసుకువస్తుంది. ప్రపంచంలోనే అత్యంత శుభ్రమైన శుద్ధి కర్మాగారంగా ఇది నిలుస్తుంది' అని ట్రంప్ పోస్టులో పేర్కొన్నారు. ఇప్పటికే 2024లో డల్లాస్ ప్రాంతానికి చెందిన స్టార్టప్ సంస్థ ఎలిమెంట్ ఫ్యూయల్స్ హోల్డింగ్స్ బ్రౌన్స్‌విల్లేలో దాదాపు 50 సంవత్సరాల తర్వాత పూర్తిగా కొత్త అమెరికన్ చమురు శుద్ధి కర్మాగారం నిర్మించేందుకు ప్రణాళికను తిరిగి ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈ ప్రాజెక్టు అమలులోకి వస్తే అమెరికా ఇంధన రంగంలో పెద్ద మార్పులు తీసుకురావడంతో పాటు భారత్-అమెరికా ఇంధన భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# హర్మూజ్ జలసంధి వద్ద తీవ్ర ఉద్రిక్తతలు

- ఇరాన్‌కు చెందిన 16 మైన్‌లేయర్స్, పలు నౌకలు ధ్వంసం



**టెహ్రాన్, మార్చి 11:** చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి సమీపంలో భీకర దాడులు జరిగాయి. ఈ జలసంధి సమీపంలో ఇరాన్ మోహరించిన మైన్‌లేయర్స్, నౌకలు లక్ష్యంగా అమెరికా దళాలు విరుచుకుపడ్డాయి. దీంతో అవి ధ్వంసమయ్యాయి. తాము జరిపిన దాడుల్లో ఇరాన్ కు చెందిన 16 మైన్‌లేయర్స్‌తో పాటు పలు నౌకలు ధ్వంసం అయ్యాయని యూఎస్ సెంట్రల్ కమాండ్ పేర్కొంది. ఈ దాడికి సంబంధించిన వీడియోను ఎక్స్‌లో పోస్టు చేసింది. జలసంధిలో పేలుడు సృష్టించడానికి ఇరాన్ సన్నాహాలు చేస్తున్నట్లు అమెరికా నిఘా వర్గాలకు సమాచారం అందిందని ఆ దేశ మీడియా పేర్కొంది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు చేశారు. జలసంధి సమీపంలో ఇరాన్ ఎక్కడైనా మైన్స్‌ను అమర్చినట్లయితే.. వాటిని తక్షణమే తొలగించాలని ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. లేదంటే పర్యవసానాలు చాలా తీవ్రంగా.. మునుపెన్నడూ చూడని స్థాయిలో ఉంటాయని హెచ్చరించారు. ఇరాన్ స్వయంగా వాటిని తీసేస్తే.. అది మంచి పరిణామం అన్నారు. లేదంటే కరేబియన్ సముద్రంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా నౌకలను ధ్వంసం చేసేందుకు ఉపయోగించిన క్షిపణులను వాడి జలసంధిలోని మైన్‌లేయర్స్ పడవలను లక్ష్యంగా చేసుకుంటామన్నారు. ట్రంప్ హెచ్చరికల తర్వాత ఇరాన్ మైన్‌లేయర్స్‌ను ధ్వంసం చేసినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వేళ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి సమీపంలో భీకర దాడులు జరిగాయి. ఈ జలసంధి సమీపంలో ఇరాన్ మోహరించిన మైన్‌లేయర్స్, నౌకలు లక్ష్యంగా అమెరికా దళాలు విరుచుకుపడడంతో అవి ధ్వంసమయ్యాయి. తాము చేపట్టిన దాడుల్లో ఇరాన్‌కు చెందిన 16 మైన్‌లేయర్స్‌తో పాటు పలు నౌకలు ధ్వంసం అయ్యాయని యూఎస్ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. ఈ క్రమంలనే దాడికి సంబంధించిన వీడియోను ఎక్స్‌లో పోస్టు చేసింది. ఇరాన్‌తో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో రష్యా చమురును కొనుగోలు చేసేందుకు భారత్‌కు ఇచ్చిన అనుమతి వల్ల పుతిన్ సర్కార్‌కు పెద్దగా ఆర్థిక ప్రయోజనం ఉండదని శ్వేతసౌధం ప్రకటించింది.

# 17న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

## వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేసిన టీటీడీ

**తిరుమల, మార్చి 11:** తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో 19న ఉగాది ఆస్థానాన్ని పురస్కరించుకుని 17వ తేదీ మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరగనుంది ఉత్సవాలకు ముందు మంగళవారం కోయిల ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆపవాయితీగా వస్తోంది. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కారణంగా 17న వీఐపీ బ్రేక్ దర్శనాలు, అష్టదళ పాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది. 16వ తేది ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించబడవు. అదేవిధంగా మార్చి 19న ఉగాది ఆస్థానం సందర్భంగా ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా విఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేయడమైనది. ఈ కారణంగా 18వ తేది విఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించరని టిటిడి తెలిపింది.



# అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రవాణా వ్యవస్థ

మొదటి పేజీ తరువాయి

"హైదరాబాద్‌ను ట్రాఫిక్ రహిత నగరంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం. ఇందుకోసం ఇప్పటికే గుర్తించిన ప్రాంతాల్లో కనెక్టివిటీ రోడ్ల నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలి" అని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రధాన జిల్లా కేంద్రాలన్నింటికీ ఒక రింగ్ రోడ్డును నిర్మించి, వాటిని జాతీయ రహదారులతో అనుసంధానించాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. దీనివల్ల జిల్లాల్లో ఆర్థికాభివృద్ధి వేగవంతం కావడమే కాకుండా, రవాణా కష్టాలు తీరుతాయని ఆయన ఆకాంక్షించారు. భూసేకరణ వంటి అడ్డంకులు కలగకుండా జీహెచ్ఎంసీ, రెవెన్యూ విభాగాల మధ్య పూర్తి సమన్వయం ఉండాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పేద ప్రజలకు అత్యాధునిక వైద్యం చేరువ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న అన్ని టీచింగ్ హాస్పిటల్స్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి, కార్పొరేట్ స్థాయిలో పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూడాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. భవనాల నిర్మాణం వేగవంతం చేయడం ద్వారా వైద్య సేవలు మరింత మందికి అందుబాటులోకి వస్తాయని ఆయన అన్నారు.



# వెలుగుమట్లలో 'మోడల్ కాలనీ'



- డిసెంబర్ 9న సామూహిక గృహప్రవేశాలు
- పేదల కలను నిజం చేస్తున్న ప్రజా ప్రభుత్వం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- 412 మంది బాధితులకు ఇళ్ల పట్టాల పంపిణీ
- రూ. 22,500 కోట్లతో లక్ష్యం సాకారం

**ఖమ్మం, మార్చి 11:** ఖమ్మం జిల్లా వెలుగుమట్ల భూదాన్ భూముల్లో దశాబ్దాలుగా గూడు కోసం నిరీక్షిస్తున్న పేదల కల సాకారమైంది. వెలుగుమట్లలో దేశమే గర్వపడేలా అన్ని మౌలిక వసతులతో కూడిన 'మోడల్ కాలనీ'ని నిర్మిస్తామని, ఈ ఏడాది డిసెంబర్ 9వ తేదీ నాటికి నిర్మాణాలు పూర్తి చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా గృహప్రవేశాలు చేయిస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ప్రకటించారు. బుధవారం ఖమ్మంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులతో కలిసి ఆయన వెలుగుమట్ల బాధితులకు ఇళ్ల పట్టాలు, ఇందిరమ్మ ఇళ్ల అనుమతి పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో వెలుగుమట్ల పేదలను కొందరు మాఫియా శక్తులు మోసం చేసి లక్షలాది రూపాయలు వసూలు చేశాయని మండిపడ్డారు. పేదల నిస్సహాయతను అడ్డు పెట్టుకుని రాజకీయాలు చేసిన వారు పదేళ్లలో కనీసం విద్యుత్, నీటి సౌకర్యం కూడా ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. కోర్టు ఆదేశాల నేపథ్యంలో మానవీయ కోణంలో స్పందించి, అర్హులైన 412 మందిని గుర్తించి ప్రభుత్వమే స్థలంతో పాటు ఇల్లు కట్టిస్తోందని తెలిపారు. ఇకపై ఏ ముఠా కూడా పేదలను బెదిరించలేదని, వారు ఆత్మగౌరవంతో బతకవచ్చని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏ ఒక్క పేదవాడు గూడు లేకుండా ఉండకూడదన్నదే ప్రభుత్వ ఆశయమని భట్టి పేర్కొన్నారు. ఇందులో భాగంగానే తొలి ఏడాది 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఏకంగా రూ. 22,500 కోట్లు కేటాయించి చరిత్ర సృష్టించామని వెల్లడించారు. వెలుగుమట్ల మోడల్ కాలనీలో ఇళ్లతో పాటు స్కూళ్లు, ఆసుపత్రులు, కమ్యూనిటీ హాల్స్, షాపింగ్ కాంప్లెక్స్ వంటి అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. మిగిలిన 16 ఎకరాల భూమిని తెలంగాణ పబ్లిక్ స్కూల్ మరియు ఇతర ప్రభుత్వ విద్యా సంస్థల కోసం ఉపయోగిస్తామని ప్రకటించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, వెలుగుమట్ల భూముల విషయంలో పదేళ్లు అధికారంలో ఉన్నవారు ఒక్క పట్టా కూడా ఇవ్వకుండా ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణం కంటే ముందే మౌలిక వసతులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, భూదాన్ ట్రస్టు సభ్యులమని చెప్పుకుంటూ పేదలను మోసం చేసిన శక్తులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాళీ చేయించే సమయంలో కూడా పేదలపై ఒక్క లాఠీ దెబ్బ పడకుండా జాగ్రత్త వహించామని, ఎప్పటికైనా ఈ భూములు పేదలకే చెందాలని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టాలు అందుకున్న లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

# మహిళల ఆరోగ్యంపై సర్కార్ భరోసా

- 'ఉమెన్ వెల్‌నెస్'లో నిర్లక్ష్యం వద్దు
- 46 లక్షల మంది డ్వాక్రా మహిళలకు 30 రకాల ఉచిత పరీక్షలు
- నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు
- అధికారులతో మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష



**హైదరాబాద్, మార్చి 11:** రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న లక్షలాది మంది మహిళల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఉమెన్ వెల్‌నెస్ ప్రొఫైలింగ్' ప్రోగ్రామ్ అమలులో ఎలాంటి అలసత్వం వహించవద్దని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయం నుంచి ఆరోగ్యశాఖ మరియు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన ఈ కార్యక్రమ పురోగతిని సమీక్షించారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా నాన్-కమ్యూనికబుల్ వ్యాధులను ముందుగానే గుర్తించి మెరుగైన వైద్యం అందించడమే ఈ బృహత్తర కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. పరీక్షల కోసం గ్రామాల నుంచి మహిళలను ఆసుపత్రులకు తీసుకురావడానికి మరియు తిరిగి సురక్షితంగా ఇళ్లకు చేర్చడానికి అవసరమైన వాహనాలను సమకూర్చాలని మంత్రి సెర్ప్ అధికారులకు సూచించారు. ఆసుపత్రుల్లో మహిళలకు తాగునీరు, కుర్చీలు వంటి కనీస సదుపాయాలు కల్పించాలని, రద్దీ పెరగకుండా ఒక పద్ధతి ప్రకారం షెడ్యూల్ పాటించాలని ఆదేశించారు. రక్త నమూనాల సేకరణ నుంచి ల్యాబ్‌లకు చేర్చే వరకు 'కోల్డ్ చైన్' ప్రోటోకాల్స్‌ను పక్కాగా పాటించాలని, డేటా ఎంట్రీలో తప్పులు దొర్లకుండా జాగ్రత్త పడాలని హెచ్చరించారు. స్క్రీనింగ్‌లో ఏదైనా అనారోగ్యం తేలితే ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే చికిత్స ప్రారంభించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 32 జిల్లాల్లోని 542 మండలాల్లో ఉన్న సుమారు 46 లక్షల మంది డ్వాక్రా మహిళలకు ఈ పథకం కింద 30 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. రక్తహీనత, మధుమేహం, బీపీ, థైరాయిడ్, కిడ్నీ మరియు కాలేయ పనితీరు వంటి కీలక పరీక్షలు ఇందులో భాగం. ప్రస్తుతం ప్రతి జిల్లాలో ఐదు మండలాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి మొదటి దశను ప్రారంభించగా, త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని మండలాలకు ఈ సేవలను విస్తరించనున్నారు. పరీక్షలు చేయించుకున్న ప్రతి మహిళకు క్యూఆర్ (QR) కోడ్ ఆధారిత డిజిటల్ హెల్త్ రికార్డులను సృష్టించి, ఈ-హెచ్ఎంఐఎస్ ప్లాట్‌ఫారమ్‌కు అనుసంధానిస్తారు. లబ్ధిదారుల ఆరోగ్య సమాచారం నేరుగా వారి మొబైల్‌కు ఎస్ఎంఎస్ లేదా 'ఈ-ఆరోగ్యం' యాప్ ద్వారా అందుతుంది. ఈ డిజిటల్ డేటాబేస్ వల్ల భవిష్యత్తులో మహిళలు ఏ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లినా పాత రిపోర్టులు వెంట తీసుకెళ్లాల్సిన అవసరం లేకుండానే సులభంగా వైద్య సేవలు పొందే అవకాశం కలుగుతుందని మంత్రి వివరించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూ, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఎస్సీ విద్యార్థుల ఖాతాల్లోకి..

## 374 కోట్ల రూపాయల నిధులు

**హైదరాబాద్, మార్చి 11:** పోస్టుమెట్రిక్ స్కాలర్షిప్స్ క్రింద ఎస్సీ విద్యార్థులకు బోధనా రుసుములు మరియు మెయింటెనెన్స్ చార్జీలను 2024-25 సంవత్సరం నుండి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో చెల్లిస్తున్నాయన్న విషయమూ, అట్టి సొమ్ము విద్యార్థుల ఖాతాల్లోకి నేరుగా జమ చేయడం జరుగుతోంది. ఇందులో భాగంగా ఈ సంవత్సరంలో ఇప్పటికి రూ. 374.00 కోట్ల నిధులు, రాష్ట్రంలోని వివిధ కళాశాలలకు చెందిన 83239 మంది ఎస్సీ విద్యార్థుల ఖాతాల్లోకి నేరుగా జమ చేయడమైనది. ఇందులో రాష్ట్రప్రభుత్వం తన వాటా కింద రూ.173.00 కోట్లు విడుదల చేయగా కేంద్రప్రభుత్వం రూ. 201.00 కోట్లు విడుదల చేసింది. విద్యార్థులు తమకు చెందిన మెయింటెనెన్స్ అమౌంట్ ను మినహాయించుకుని, బోధానా రుసుమును (ట్యూషన్ ఫీజు) ఇతరేతర రుసుములను కళాశాలకు చెల్లించాల్సి ఉంటుంది. ఉపకారవేతన నిధులు జమ చేయబడిన విద్యార్థుల వివరాలు సంబంధిత కళాశాల ప్రిన్సిపల్స్ ఈ-పాస్ లాగిన్స్ లో పొందుపరచడం కూడా జరిగిందని తెలియజేస్తున్నాం. నిధులను విడుదల చేసిన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, ఉపముఖ్యమంత్రివర్యులు ఆర్థిక శాఖామాత్యులు భట్టి విక్రమార్క రికి ఉపకారవేతనాలు పొందిన విద్యార్థులు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. నిధుల విడుదలకై విశేషమైన కృషి చేసిన ఎస్సీ అభివృద్ధిశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కి ఎస్సీ విద్యార్థులందరూ మనస్ఫూర్తిగా తమ కృతజ్ఞతలు తెలియజేశారు.

# 15న ఎల్‌బీ స్టేడియంలో ఇఫ్తార్ విందు

**హైదరాబాద్, మార్చి 11:** రంజాన్ పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 'దావత్-ఎ-ఇఫ్తార్' వేడుకను ఈ నెల 15వ తేదీన హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లపై రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ బుధవారం అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి స్టేడియంలోని వివిధ విభాగాలను పరిశీలించి, అధికారులకు దిశానిర్దేశం చేశారు. మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తాను నిర్వహిస్తున్న మొదటి అధికారిక ఇఫ్తార్ విందు ఇదేనని, దీనిని అత్యంత ఘనంగా నిర్వహించాలని మంత్రి అజారుద్దీన్ ఆకాంక్షించారు. ఈ వేడుకకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మతపెద్దలు, వివిధ వర్గాల ప్రముఖులు హాజరుకానున్నారు. సుమారు 10 వేల మంది అతిథులు పాల్గొనే అవకాశం ఉన్నందున, ఎక్కడా ప్రోటోకాల్ లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ శాఖ ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల మళ్లింపు మరియు పార్కింగ్ సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు, ఆర్ అండ్ బి ఆధ్వర్యంలో బ్యారికేడింగ్ మరియు స్టేజ్ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. నిరంతర విద్యుత్ సరఫరా, త్రాగునీరు మరియు వైద్య శిబిరాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో డయాస్‌ను పూలతో అలంకరించాలని, సమాచార శాఖ ద్వారా ఎల్ఈడీ స్క్రీన్లు, ప్రత్యక్ష ప్రసార ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.



# దానం, కడియంకు బిగ్ రిలీఫ్

**హైదరాబాద్, మార్చి 11:** తెలంగాణ రాజకీయాల్లో గత కొంతకాలంగా ఉత్కంఠ రేపుతున్న ఎమ్మెల్యేల ఫిరాయింపుల వ్యవహారానికి సంబంధించి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సంచలన తీర్పు వెలువరించారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు దానం నాగేందర్ (ఖైరతాబాద్), కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్)లపై దాఖలైన అనర్హత పిటిషన్లను స్పీకర్ డిస్మిస్ చేశారు. వీరు పార్టీ మారినట్లు తగిన ఆధారాలు లేవని, ఇప్పటికీ వారు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే కొనసాగుతున్నారని స్పష్టం చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున గెలిచిన ఈ ఇద్దరు నేతలు, ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరినట్లు సామాజిక మాధ్యమాల్లో వార్తలు వచ్చాయి. దీనిపై బీఆర్ఎస్, బీజేపీ నేతలు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. అయితే, తాజాగా జరిగిన విచారణలో తాము కాంగ్రెస్‌లో చేరలేదని, పార్టీ సభ్యత్వం తీసుకోలేదని ఎమ్మెల్యేలు వాంగ్మూలం ఇచ్చారు. టెక్నికల్‌గా వారు పార్టీ మారినట్లు రుజువు కాకపోవడంతో స్పీకర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే ఎనిమిది మందికి క్లీన్ చిట్ ఇచ్చిన స్పీకర్, తాజా నిర్ణయంతో మొత్తం పదిమంది ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లను కొట్టివేసినట్లయింది.

### సుప్రీం విచారణ వేళ కీలక పరిణామం

ఎమ్మెల్యేల అనర్హత అంశంపై గురువారం సుప్రీంకోర్టులో తుది విచారణ జరగనుంది. ఈ కేసు మళ్లీ విచారణకు వచ్చేలోపు స్పీకర్ తన నిర్ణయాన్ని ప్రకటించాలని గతంలో అత్యున్నత న్యాయస్థానం సూచించిన నేపథ్యంలో, ఒకరోజు ముందే స్పీకర్ తీర్పు వెలువరించడం ప్రాధాన్యత సంతరించుకుంది. రేపు సుప్రీంకోర్టులో ఈ తీర్పుపై ఎటువంటి చర్చ జరుగుతుందనేది ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

### తీర్పును స్వాగతించిన దానం: 'కేసీఆర్ అంటే గౌరవం ఉంది'

స్పీకర్ నిర్ణయం వెలువడిన అనంతరం ఎమ్మెల్యే దానం నాగేందర్ మీడియాతో మాట్లాడారు. "నేను ఎప్పుడూ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయలేదు, కాంగ్రెస్ సభ్యత్వం తీసుకోలేదు. నగరాభివృద్ధి కోసం సీఎంతో కలిసి పనిచేస్తున్నానే తప్ప పార్టీ మారలేదు. కేసీఆర్ అంటే నాకు ఇప్పటికీ గౌరవం ఉంది. ఒకవేళ నన్ను అనర్హుడిగా ప్రకటించి ఉప ఎన్నిక వచ్చినా నేను సిద్ధమే" అని ధీమా వ్యక్తం చేశారు. తనపై ఫిర్యాదు చేయడానికి కౌశిక్ రెడ్డికి ఏ అధికారం ఉందని ఆయన ప్రశ్నించారు.

# కేసీఆర్ క్షమాపణ చెబితే రాజీనామాకు సిద్ధం

## నైతిక విలువలు నా ఒక్కడికేనా? : కడియం

## గతంలో ఫిరాయింపుదారులకు మంత్రి పదవుల సంగతేంటి?

## కేసీఆర్‌తో సిద్ధాంతపరమైన విభేదాలే కారణం


**హైదరాబాద్, మార్చి 11:** అనర్హత పిటిషన్‌పై తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చిన తీర్పును ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్వాగతించారు. ప్రస్తుతం తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నానని, నియోజకవర్గం అభివృద్ధి కోసం కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తున్నానని స్పష్టం చేశారు. కేసీఆర్‌తో తనకు సిద్ధాంతపరంగా విభేదాలు ఉన్నాయని చెప్పారు. బీఆర్ఎస్ సుప్రీం కోర్టుకు వెళ్లినా ఎదుర్కొంటానని.. ప్రజాక్షేత్రంలో తేల్చుకోవడానికి కూడా సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో జరిగిన ఫిరాయింపులపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నైతిక విలువలు తనకు మాత్రమే వర్తిస్తాయా? కేసీఆర్‌కు వర్తించవా? అని ప్రశ్నించారు. కేసీఆర్ తన హయాంలో జరిగిన ఫిరాయింపులకు ప్రజలకు క్షమాపణ చెప్పాలని కడియం శ్రీహరి డిమాండ్ చేశారు. 'కేసీఆర్ క్షమాపణ చెప్పితే నేను రాజీనామాకు సిద్ధం' అని స్పష్టం చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలను కేసీఆర్ మంత్రులుగా చేయలేదా? అని ప్రశ్నించారు. టీడీపీ శాసనసభా పక్షం బీఆర్ఎస్‌లో విలీనం కాకముందే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మంత్రిని చేశారని, ఇది నైతికమా? అని సవాల్ విసిరారు. రాజకీయంగా తమను ఎదగకుండా చేయడానికే కేసీఆర్ జిల్లాల విభజన చేశారని కడియం శ్రీహరి ఆరోపించారు. ఎంతో చరిత్ర ఉన్న వరంగల్‌ను ఆరు జిల్లాలుగా చేయడాన్ని తాను తీవ్రంగా వ్యతిరేకించి నట్లు తెలిపారు. కేసీఆర్ నాయకత్వాన్ని సిద్ధాంతపరంగా విభేదించానని ఎమ్మెల్యే అన్నారు. మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డికి ప్రైవేట్ యూనివర్సిటీలు ఇవ్వడానికే తన స్థానంలో సబితను విద్యాశాఖ మంత్రిని చేశారని ఆయన ఆరోపించారు. ప్రైవేట్ యూనివర్సిటీలకు తాను వ్యతిరేకమని.. అన్ని విషయాలు త్వరలోనే బయటపెడతానని హెచ్చరించారు.

# ప్రజాస్వామ్యంపై బహిరంగ దాడి

## కడియం, దానంకు క్లీన్‌చిట్‌పై కేటీఆర్



**హైదరాబాద్, మార్చి 11:** పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరికి శాసనసభాపతి ప్రసాద్ కుమార్ క్లీన్ చిట్ ఇవ్వడం ప్రజాస్వామ్యంపై బహిరంగ దాడి అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ స్పీకర్ తీసుకున్న ఈ నిర్ణయం ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజుగా అభివర్ణించారు. ఇది కేవలం ఒక తీర్పు కాదు.. అధికారంలో ఉన్నవారికి అనుకూలంగా రాజ్యాంగ వ్యవస్థలను ఉపయోగించే ఉదాహరణ అని పేర్కొన్నారు. ఇలాంటి నిర్ణయాలు ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయన్నారు. తెలంగాణ ప్రజలు అన్నీ గమనిస్తున్నారని.. సరైన సమయంలో సమాధానం చెబుతారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ బీఫామ్ మీద ఎంపీగా పోటీ చేసిన వ్యక్తికే క్లీన్‌చిట్ ఇవ్వడం అంటే ప్రజల తీర్పును అవమానించడమేనని వ్యాఖ్యానించారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ స్పీకర్ తీసుకున్న నిర్ణయం ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజు అని కేటీఆర్ అభివర్ణించారు. ఇది కేవలం తీర్పు కాదు.. అధికారంలో ఉన్న వారికి అనుకూలంగా రాజ్యాంగ వ్యవస్థను ఉపయోగించే ఉదాహరణ అన్నారు. ప్రజల ఓట్లతో గెలిచిన పదవులను లాభాల కోసం మార్చుకుంటే.. స్పీకర్ దానికి ఆమోద ముద్ర వేస్తే.. ప్రజాస్వామ్య విలువలు ఎక్కడ నిలుస్తాయని ప్రశ్నించారు. ఇలాంటి నిర్ణయాలు ప్రజల విశ్వాసానికి దెబ్బ అని అన్నారు.



## సంపాదకీయం

# జల్‌జీవన్‌తో నీటి సమస్య పరిష్కారం అయ్యేనా ?

ఏటా వరదలు, నీటి కరువు సాధారణం అయ్యింది. వర్షాకాలంలో వరదలు ముంచెత్తితే..ఎండాకాలంలో మంచినీటి కటకటలు తప్పడం లేదు. ఈ సమస్య పరిష్కారానికి ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకోవడం లేదు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ సమస్యపై స్పష్టమైన అవగాహన కలగడం లేదు. మనకు ఎన్నో జీవనదులు, సహజసిద్ధ వనరులు ఉన్నా, వాటిని వినియోగించడం ఎలా అన్న ఆలోచన చేయడం లేదు. ఎండాకాలం రాగానే తాత్కాలిక పథకాలతో మంచినీటి సమస్యను గట్టెక్కిస్తున్నారు. ఇకపోతే కేంద్రం జల్‌జీవన్ మిషన్ కింద లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నా..శాశ్వత పరిష్కారం చూపడం లేదు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా రక్షిత మంచినీరు అందించే జల్ జీవన్ మిషన్ పథకం అమలు కాలపరిమితిని కేంద్ర ప్రభుత్వం 2028 డిసెంబరు వరకు పొడిగించింది. 2019-2024 వరకే పరిమితమైన ఈ పథకం చాలా రాష్ట్రాల్లో పూర్తిస్థాయిలో అమలుకాని విషయాన్ని ప్రభుత్వం పరిగణనలో తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన మంగళవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం దీనిపై నిర్ణయం తీసుకుంది. ఈ పథకం మొత్తం కేటాయింపులను రూ.8.69 లక్షల కోట్లకు పెంచింది. ఇందులో కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన రూ.2.08 లక్షల కోట్ల నుంచి రూ.3.59 లక్షల కోట్లకు పెంచాలని నిర్ణయించింది. దీనివల్ల రాష్ట్రాలకు రూ.1.51 లక్షల కోట్ల అదనపు ప్రయోజనం కలగనుంది. పథకం అమలును పర్యవేక్షించేందుకు జాతీయస్థాయిలో సుజలం భారత్ పేరుతో ఒక డిజిటల్ ఫ్రేమ్‌వర్క్‌ను అమల్లోకి తేనుంది. దీనికింద ప్రతి పల్లెను ఒక సుజల గ్రామంగా గుర్తించి ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయిస్తారు. ఈ పథకం కింద చేపట్టిన పనులు పూర్తయినట్లు గ్రామపంచాయతీలు ధ్రువీకరించి, ప్రతి ఇంటికీ కొళాయి నీరు అందించేందుకు సిద్ధమైనట్లు ప్రకటించాల్సి ఉంటుంది. ఆ తర్వాతే పథకం నిర్వహణకు అవసరమైన యంత్రాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటుచేస్తాయి. పథకాన్ని ప్రజలు సొంతం చేసుకొని సామాజికంగా, ఉమ్మడిగా నిర్వహించేలా ప్రోత్సహించేందుకు ఏటా 'జల్ ఉత్సవ్' కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. అన్ని గ్రామాలనూ 'హర్‌ఘర్ జల్' గ్రామాలుగా తయారు చేస్తామని ప్రకటించారు. అయితే ఈ పథకానికి అవసరమైన నీటి వనరులను సమకూర్చడంలో మాత్రం రాష్ట్రాలు దృష్టి సారించడం లేదు. జల్‌జీవన్ పథకం అమల్లో ఉన్నా గ్రామాల్లో మంచినీటి సమస్యలు తీరడం లేదు. కారణం నీటి వనరులను వినియోగించక పోవడమే. వేసవి వస్తున్నదంటే మంచినీటికి కటకటలాడాల్సిన పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలని ప్రజలు ఆందోళన చెందడం సర్వసాధారణ మైపోతున్నది. పాలకుల అసమర్థత, కొందరు అధికారుల అవినీతి, అవగాహనారాహిత్యంతో పాటు ప్రకృతి సహాయనిరాకరణ కూడా తోడుకావడంతో అందుబాటులో ఉన్న కలుషిత నీటిని తాగి రోగాల బారిన పడుతున్నారు. ప్రజల్లో అవ గాహనలోపం కారణంగా భూగర్భజలాల సమస్య రాను రాను తీవ్ర రూపం దాల్చుతున్నది. మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు ఇప్పటి నుంచే పటిష్టమైన ప్రణాళికతో యుద్ధప్రాతిపదికపై చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. వేసవి వచ్చిందంటే తెలుగు రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాల్లో నగరాలు, పట్టణాల్లో మంచినీటి వ్యాపారం అదుపు లేకుండాపోతున్నది. ఇప్పుడు ఈ వ్యాపారం నగరాలకేకాక, మండల కేంద్రాలకు, గ్రామాలకు శివారు పల్లెలకు కూడా విస్తరించింది. ఎలాంటి అనుమతులు లేకుండానే ఇష్టానుసారంగా మంచినీటి పేరుతో కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతున్నాఅడిగేవారు, అడ్డగిం చేవారు లేకుండా పోతున్నారు. కలుషితనీరు అనేక వ్యాధులకు కారణాలవుతున్నాయి. పాలకులు మంచినీటి విషయంలో ప్రత్యేక చర్యలుతీసుకోవాల్సిన అవసరం ఉంది. భూగర్భజలాల మట్టాలు తగ్గిపోవడం మానవాళికి ఏ మాత్రం క్షేమంకాదు. ఇకపోతే లక్షలాది ఎకరాలకు సరి పోయే వేలాది టిఎంసిల నీరు వివిధ నదుల ద్వారా పొంగిపొర్లి యేటా సముద్రంపాలవుతున్నది. ఇప్పటికీ దేశంలోని ప్రజలందరికీ కనీస అవసరమైన గుక్కెడు స్వచ్ఛమైన నీరు అందించ లేని అధ్వాన్న పరిస్థితుల్లో ఉన్నాం.దేశవ్యాప్తంగా ఇప్పటివరకు లక్షలాది కోట్ల రూపాయలు ఖర్చుపెట్టారు. పెడుతున్నా రు. కానీ వ్యయం చేస్తున్న నిధుల్లో ఏ మేరకు క్షేత్ర స్థాయి వరకు వెళ్లి ప్రజలకు ఉపయోగపడుతున్నాయనేదే ప్రశ్న. కరవుల్లోనే కాదు వర్షాలు సమృద్ధిగా కురిసిన సంవత్సరాల్లో అనేక ప్రాంతాల్లో మంచినీటి సమస్యతీవ్రంగా ఉంటుంది. ఈసారి వేసవిలో నీటికొరత తీవ్రంగా ఉండే అవకాశాలు న్నట్లు భూగర్భశాస్త్రజ్ఞులు అంచనా వేస్తున్నారు. బోరు బావుల వినియోగం దేశవ్యాప్తంగా విపరీతంగా పెరిగిపో తున్నది. విద్యుత్ డిమాండ్ తోపాటు నీటి వృధా కూడా పెరుగు తున్నదనే చెప్పొచ్చు. తగ్గిపోతున్న భూగర్భజలాల భర్తీకి అవసరం మేరకు ప్రయత్నాలు జరగకపోవడంతో దేశం లోని అనేక రాష్ట్రాల్లో నీటి మట్టాలు పడిపోతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే భూగర్భ జలాలు పూర్తిగా అంతమయ్యే పరిస్థితులు ఏర్పడవచ్చునని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నానాటికీ బోరుబావుల మీద ఆధారపడాల్సిన పరిస్థితి పెరిగిపోతే అనేక అనర్థాలకు దారితీస్తున్నది. భూగర్భ జలాల వినియోగం మూడింతలు పెరగడం వల్ల భూగర్భ జలమట్టాలు పడిపోతున్నాయి. దేశరాజధాని ఢిల్లీతోసహా పంజాబ్, రాజ స్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్లో ఇష్టానుసారంగా లక్షలాది కోట్ల లీటర్ల భూగర్భజలాలు తోడేస్తున్నారు. దేశంలో మూడోవంతు జిల్లాల్లో అనేక ప్రాంతాల్లో భూగర్భజలాలు తాగు యోగ్యమైనవి కావని గతంలోనే కేంద్రం అంగీకరించింది. రాబోయే వేసవిలో మంచినీటి కొరతను దృష్టిలో పెట్టుకుని ముందస్తు ప్రణాళికలు సిద్దం చేసుకోవాల్సి ఉంది.



# అమెరికా ఆర్థిక సంస్థలపై దాడులు చేస్తాం

- ఇరాన్ సంచలన హెచ్చరిక
- టెక్ దిగ్గజాలపై దాడులకు సిద్ధమంటూ ప్రకటన
- గూగుల్, మైక్రోసాఫ్ట్ సంస్థలకు వార్నింగ్
- టెహ్రాన్ బ్యాంకుపై ఇజ్రాయెల్ దాడికి ప్రతికారం
- హోర్ముజ్ జలసంధి మూసివేతతో భారత్‌కు చమురు సెగ




**టెహ్రాన్/వాషింగ్టన్:** ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఘర్షణ 12వ రోజుకు చేరుకోవడంతో పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు మరింత తీవ్రమయ్యాయి. ఇన్నాళ్లూ చమురు క్షేత్రాలు, సైనిక స్థావరాలకే పరిమితమైన దాడులు ఇప్పుడు ఆర్థిక కేంద్రాల వైపు మళ్లాయి. అమెరికా, ఇజ్రాయెల్‌కు చెందిన ప్రముఖ బ్యాంకులు, ఆర్థిక సంస్థలపై దాడులు చేస్తామని ఇరాన్ మిలిటరీ తాజాగా హెచ్చరించింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని కీలకమైన 'బ్యాంక్ సెపా'పై ఇజ్రాయెల్ క్షిపణి దాడి చేయడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఇరాన్, ఇకపై తాము కూడా అదే రీతిలో బదులిస్తామని స్పష్టం చేసింది. ఇరాన్ మిలిటరీ కమాండ్ 'ఖాటమ్ అల్ అన్బియా' విడుదల చేసిన హిట్ లిస్టులో అమెరికాకు చెందిన అగ్రశ్రేణి కంపెనీలు ఉన్నాయి. గూగుల్, మైక్రోసాఫ్ట్, ఐబీఎం, ఎన్విడియా, ఒరాకిల్ వంటి టెక్ సంస్థలు తమ లక్ష్యాలని ఇరాన్ ప్రకటించింది. గల్ఫ్ దేశాలు, ఇజ్రాయెల్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న ఈ సంస్థల కార్యాలయాలకు ప్రజలు దూరంగా ఉండాలని, కనీసం ఒక కిలోమీటర్ పరిధిలో ఉండవద్దని హెచ్చరికలు జారీ చేసింది. ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీయడం ద్వారా శత్రు దేశాలను లొంగదీసుకోవాలని వ్యూహరచన చేస్తోంది.

### భారత్‌పై తీవ్ర ప్రభావం

యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాకు కీలకమైన 'హోర్ముజ్ జలసంధి'లో రవాణా స్తంభించిపోయింది. దీనివల్ల భారతదేశం, చైనా వంటి ఆసియా దేశాలకు ముడిచమురు సరఫరా నిలిచిపోయి సంక్షోభం నెలకొంది. భారత్ తన అవసరాల కోసం గల్ఫ్ దేశాలపైనే ఎక్కువగా ఆధారపడుతుండటంతో, ఇక్కడ ఉద్రిక్తతలు పెరిగితే దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉంది.

### రంగంలోకి అగ్రరాజ్యాలు

మరోవైపు ఇరాన్ వద్ద ఉన్న అణు నిల్వలు, క్షిపణి తయారీ కేంద్రాలే లక్ష్యంగా అమెరికా, ఇజ్రాయెల్ దాడులను ఉధృతం చేశాయి. ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ నివాసంపై జరిగిన దాడుల తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రస్తుతం ఇరుపక్షాలు రాజీ పడే సూచనలు కనిపించకపోవడంతో, ఈ 'ఆర్థిక యుద్ధం' ప్రపంచ మార్కెట్లపై ఎటువంటి ప్రభావం చూపుతుందోనని అంతర్జాతీయ సమాజం ఆందోళన చెందుతోంది.

# పశ్చిమాసియా యుద్ధంపై రాజకీయాలా

- గల్ఫ్‌లో చిక్కుకున్న భారతీయులందరినీ క్షేమంగా తీసుకొస్తాం
- కేరళ పర్యటనలో కాంగ్రెస్, వామపక్షాల తీరుపై మండిపాటు



**తిరువనంతపురం, మార్చి 11:** ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీతోపాటు ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై ప్రధాని నరేంద్ర మోదీ విమర్శలు సంధించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బాధ్యతా రహితంగా మాట్లాడుతున్నారని ప్రధాని మోదీ మండిపడ్డారు. దేశ యువతపై ఆయనకు అవగాహన లేదంటూ రాహుల్ తీరును ఎండగట్టారు. కాంగ్రెస్ యువరాజుకి ఏమీ తెలీదంటూ ఆయనపై పరోక్ష విమర్శలు చేశారు. దేశ అభివృద్ధిని కాంగ్రెస్ యువరాజు చూడలేక పోతున్నారంటూ రాహుల్ తీరుపై మండిపడ్డారు. బుధవారం కేరళంలోని ఎర్నాకులంలో ప్రధాని మోదీ పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. యుద్ధం పేరుతో తనను కాంగ్రెస్ పార్టీ దూషిస్తోందని తెలిపారు. ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధంపై కాంగ్రెస్, వామపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని పేర్కొన్నారు. గల్ఫ్‌లో భారతీయులు చిక్కుకోవాలని కాంగ్రెస్ పార్టీ కోరుకుంటుందన్నారు. ఆయా దేశాల్లోని భారతీయులను కాపాడేందుకు కేంద్రం అన్ని ఏర్పాట్లు చేస్తుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఇక ఈ పర్యటనలో పలు ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు చేశారు. అలాగే వివిధ పథకాలను ఆయన ప్రారంభించారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో విదేశాల్లో చిక్కుకున్న భారతీయుల్ని ఇండియాకు తీసుకొస్తామని, ఏ ఒక్కరినీ వదిలిపెట్టేది లేదని ప్రధాని మోదీ అన్నారు. ఒకవైపు ప్రపంచం సంక్షోభంలో ఉంటే కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తోందని మోదీ విమర్శించారు. త్వరలో కేరళం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మోదీ అక్కడి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కీలక ప్రసంగం చేశారు. విదేశాల్లో చిక్కుకున్న భారతీయుల్ని వదిలిపెట్టబోం. వారిని ఇండియాకు తీసుకొస్తాం. పశ్చిమాసియా సంక్షోభంలో మిగిలిపోయిన భారతీయులకు తగిన సాయం అందిస్తున్నాం. వాళ్ల క్షేమం, సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం. గల్ఫ్ కంట్రీస్‌లో ఉన్న భారతీయుల రక్షణ కోసం చర్యలు తీసుకుంటున్న అక్కడి ప్రభుత్వాలకు కృతజ్ఞతలు. మనవారి సేవలు గుర్తించి, తగిన సహాయం అందిస్తున్నాయి అక్కడి ప్రభుత్వాలు. ఆయా దేశాల్లోని భారతీయ రాయబార కార్యాలయాలు కూడా నిరంతరం పని చేస్తున్నాయి. ఒకవైపు ప్రపంచం సంక్షోభంలో ఉంటే కాంగ్రెస్ పార్టీ దీనిపై రాజకీయం చేస్తోంది. రెచ్చగొట్టేలా, బాధ్యతారాహిత్యమైన ప్రకటనలు చేస్తోంది. విదేశాల్లో ఉన్న భారతీయుల విషయంలో రాజకీయం చేయడం తగదన్నారు. ఒకవైపు ప్రభుత్వం నిరంతరం పని చేస్తుంటే ఈ అంశంలో రాజకీయ లబ్ది కోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. డ్రోన్ల తయారీలో దేశ యువత సాధిస్తున్న విజయాల గురించి కాంగ్రెస్ యువరాజు కి అవగాహన లేదు. కేరళ సహా అనేక రాష్ట్రాల్లోని స్టార్టప్‌లు డ్రోన్లు తయారు చేస్తున్నాయి. సంకుచిత మనస్తత్వం గలవారు ఇలాంటి దేశ ప్రగతిని చూడలేరు. బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీయే కూటమికి కేరళలో ఒక్కసారి అవకాశం ఇవ్వండి. అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చూపిస్తాం. రాష్ట్రం పేరును కేరళ నుంచి కేరళంనకు మార్చినందుకు ఆనందంగా ఉంది. గత ప్రభుత్వాలు కేరళకు ఏమీ చేయలేదని మోదీ అన్నారు. ఈ పర్యటన అనంతరం తమిళనాడులో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆ రాష్ట్రంలో పలు అభివృద్ధి పథకాలకు ఆయన శంకుస్థాపన చేయనుండడంతోపాటు వివిధ పథకాలను ప్రారంభించనున్నారు. ఈ రెండు రాష్ట్రాల్లో ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. మరికొద్ది రోజుల్లో తమిళనాడు, కేరళలతోపాటు అసోం, మేఘాలయా, పుదుచ్చేరి అసెంబ్లీలకు మార్చి నుంచి మే మాసాల మధ్య ఎన్నికల నగారా మోగనుంది. దీంతో ఆయా రాష్ట్రాల్లో అధికారం అందుకోవాలని బీజేపీ, కాంగ్రెస్‌తోపాటు వామపక్ష పార్టీలైన కమ్యూనిస్టు పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. ఆ క్రమంలో ప్రధాని మోదీ బుధవారం కేరళ, తమిళనాడుల్లో పర్యటిస్తున్నారు. పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు.

# స్పీకర్‌పై వీగిపోయిన అవిశ్వాస తీర్మానం

- లోక్‌సభలో విపక్షాలపై అమిత్ షా ఫైర్
- పార్లమెంటరీ రాజకీయాల్లో ఇదో దురదృష్టకరమైన ఘటన అని వ్యాఖ్యలు



**ఢిల్లీ, మార్చి 11:** లోక్‌సభలో స్పీకర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం మూజువాణి ఓటుతో వీగిపోయింది. అయితే ఈ ఓటింగ్‌కు ముందు అధికార, ప్రతిపక్షాలు ఒకరి మీద ఒకరు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించుకున్నారు. ముఖ్యంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు చేశారు. గతంలో రాహుల్ గాంధీ మోదీని కౌగిలించుకుని, తరువాత కన్ను గీటడం లాంటి చర్యలను గుర్తుచేశారు. దీనితో విపక్షాలు అమిత్ షాపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హోంమంత్రి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాయి. ప్రతిపక్షాల నినాదాల మధ్యే, సభాపతి స్థానంలో ఉన్న జగదాంబికా పాల్ ఓటింగ్ నిర్వహించారు. దీనితో విపక్షాలు పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. అనంతరం లోక్‌సభను జగదాంబికా పాల్ రేపటికి వాయిదా వేశారు.

### నిప్పులు చెరిగిన అమిత్ షా

అంతకు ముందు అవిశ్వాస తీర్మానంపై మాట్లాడుతూ అమిత్ షా విపక్షాలపై మండిపడ్డారు. లోక్‌సభ స్పీకర్ అధికార, విపక్షాలకు సమానంగా ప్రాతినిధ్యం వహించే ఒక నిష్పాక్షిక సంరక్షకుడని అన్నారు. ఓం బిర్లాపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని ఖండించిన ఆయన, సభ అనేది పార్లమెంటరీ నిబంధనల ప్రకారమే నడుస్తుందని, ఆయా రాజకీయపార్టీల రూల్స్ ప్రకారం నడవదని స్పష్టం చేశారు. ఓం బిర్లాను స్పీకర్ పదవి నుంచి తొలగించాలని కోరుతూ విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై లోక్‌సభలో మాట్లాడుతూ అమిత్ షా ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. 'స్పీకర్ చిత్తశుద్ధిని విపక్షాలు ప్రశ్నలు లేవనెత్తడం దేశ ప్రజాస్వామ్య ప్రక్రియనే ప్రశ్నించడంతో సమానం. మనం మన హక్కుల గురించి మాట్లాడవచ్చు. కానీ ఎవరూ సభ నియమాలను ఉల్లంఘించలేరు. స్పీకర్ నిర్ణయాలతో మనం ఏకీభవించలేకపోవచ్చు. కానీ మనం ఆయన మాటలకు కట్టుబడి ఉండాలే తప్ప సందేహించకూడదు. భారత పార్లమెంటరీ చరిత్రలో లోక్ సభ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం ఇది నాలుగోసారి. గతంలో బీజేపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్పీకర్‌పై ఎప్పుడూ అవిశ్వాస తీర్మానం పెట్టలేదు' అని అమిత్ షా అన్నారు.

### పరస్పర విశ్వాసం ఉండాలి!

'సభ పరస్పర విశ్వాసంతో నడుస్తుంది. అధికార పక్షానికి, ప్రతిపక్షానికి స్పీకరే సంరక్షకుడు. అందుకే నిబంధనలు రూపొందించబడ్డాయి. ఈ సభ ఒక సంతో (మార్కెట్ ప్లేస్) లేదా పండుగో కాదు. ఇక్కడ నిబంధనల ప్రకారమే ముందుకు సాగాలి. సభా నిబంధనలకు వ్యతిరేకంగా మాట్లాడే హక్కు ఎవరికీ లేదు' అని అమిత్ షా పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని వ్యతిరేకించాలనే ఉద్దేశంతో ప్రజాస్వామ్య గౌరవానికి చిహ్నమైన స్పీకర్‌పై ప్రశ్నలు లేవనెత్తడం అత్యంత విచారకరమని, అది పూర్తిగా ఖండించదగినదని అమిత్ షా అన్నారు. పార్లమెంటరీ నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న పదాలను (అన్ పార్లమెంటరీ వర్డ్స్) తొలగించే అధికారం స్పీకర్‌కు ఉంటుందని, అలాంటి భాషను రికార్డుల నుంచి తప్పక తొలగించాలని అభిప్రాయపడ్డారు. చివరిగా "మీరు మీ హక్కులను కాపాడుకోవచ్చు. కానీ ప్రివిలేజ్ (ప్రత్యేక అధికారం) అనే భ్రమలో జీవించేవారిని వారి పార్టీగానీ, ప్రజలుగానీ రక్షించలేరు. అందుకే వారు క్రమంగా ప్రజల మద్దతును కోల్పోతున్నారు" అంటూ విపక్షాలపై ఆయన విమర్శలు గుప్పించారు.





- ఒకే ఇల్లు.. ఒకే ఫ్యామిలీ.. ఒకే మనసు
- అన్నదమ్ముల ఐక్యతకు 'మార్త శివ' కుటుంబం ఆదర్శం
- కోరుట్లలో వ్యాపారంతో పాటు విలువలతో జీవిస్తున్న మార్త కుటుంబం
- తండ్రి స్థానాన్ని భర్తీ చేసిన పెద్దన్న శివకుమార్
- ఒకే వంటగది.. 'నో ఫోన్ జోన్'లో పెరుగుతున్న పిల్లలు
- వ్యాపారాల్లో విజయంతో పాటు సేవా కార్యక్రమాల్లోనూ ముందంజ

# ఐక్యతకు ఐకాన్ శివ!



### ఉమ్మడి కుటుంబం - బంధాల బలం

జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో మార్త జయలక్ష్మి-రాజమౌళి కుటుంబం ఒక ప్రత్యేకమైన ఉదాహరణగా నిలుస్తోంది. జమ్మికుంట నుంచి వ్యాపార రీత్యా కోరుట్లకు వచ్చిన ఈ కుటుంబం ప్రస్తుతం ఒకే ఇంట్లో కలిసి జీవిస్తోంది. పెద్దన్న మార్త శివకుమార్, తమ్ముళ్లు మార్త సతీష్ కుమార్, మార్త శ్రావణ్ కుమార్, వారి కుటుంబ సభ్యులు కలిసి మొత్తం 10 మంది ఒకే ఇంట్లో నివసిస్తున్నారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో ఉన్న ఆప్యాయత, పరస్పర గౌరవం ఈ కుటుంబాన్ని ప్రత్యేకంగా నిలబెడుతోంది.



### తండ్రి బాధ్యతలు తీసుకున్న పెద్దన్న

కుటుంబానికి తండ్రి లేని సమయంలో పెద్దన్న మార్త శివకుమార్ తండ్రి స్థానాన్ని భర్తీ చేసి తన తమ్ముళ్లను సమాజంలో 'సక్సెస్ ఫుల్'గా నిలబెట్టాడు. తాను మొబైల్ షాప్ ప్రారంభించడమే కాకుండా, తన ఇద్దరు తమ్ముళ్లకు కూడా చెరో మొబైల్ షాప్ ఏర్పాటు చేసి వ్యాపారంలో స్థిరపడేలా చేశాడు. ప్రస్తుతం కోరుట్లలో 'కోణార్క్ సెల్ పాయింట్'.. 'భవానీ సెల్ పాయింట్'..'సూర్య సెల్ పాయింట్' పేర్లతో మూడు మొబైల్ షాపులు విజయవంతంగా నడుస్తున్నాయి.

### ఒకే వంటగది - తల్లి పెత్తనం

ఈ కుటుంబంలో ముఖ్యమైన ప్రత్యేకత ఏమిటంటే- ఒకే వంటగది. కుటుంబ సభ్యులంతా కలిసి ఒకే చోట భోజనం చేస్తారు. ఇంటి నిర్వహణ బాధ్యతలు పూర్తిగా తల్లి జయలక్ష్మి చేతుల్లోనే ఉంటాయి. కుటుంబ ఖర్చుల కోసం ప్రతి నెలా సభ్యులు తలో రూ.20,000 చొప్పున ఇవ్వడం ద్వారా ఇంటి వ్యవహారాలు నిర్వహిస్తారు. ఈ విధానం కుటుంబంలో ఆర్థిక పారదర్శకతతో పాటు ఐక్యతను పెంచుతోంది.



ఒకే ఇంట్లో పది మంది.. ఒకే వంటగది.. ఆ అమ్మకడుపున 'త్రిమూర్తుల'వంటి ముగ్గురు కొడుకులు పుడితే.. ఆ ఇంటికి కోడళ్లుగా వచ్చిన ఇద్దరూ 'అత్త-మ్మ'కు కూతుళ్లైపోయారు. అంటే.. ఆ ఇంటోళ్లందరిదీ ఒకే మనసు.! ఈ హైటెక్ కాలంలో స్మార్ట్ ఫోన్లు, స్వార్థపు జీవనశైలి మధ్య కుటుంబ బంధాలు క్రమంగా క్షీణిస్తున్న వేళ.. కోరుట్లలో 'మార్త.శివకుమార్' కుటుంబం ఒక ప్రత్యేక ఉదాహరణగా నిలుస్తోంది.! తండ్రి స్థానాన్ని భర్తీ చేసిన పెద్దన్న శివకుమార్ తన తమ్ముళ్లను వ్యాపారంలో నిలబెట్టి, కుటుంబాన్ని ఒక తాటిపై నడిపిస్తున్న తీరు ప్రశంసనీయం. తల్లి జయలక్ష్మి కనుసన్నల్లో అన్నదమ్ములు, కోడళ్లు, పిల్లలు కలిసి ఒకే కుటుంబంగా జీవించడం నేటి సమాజంలో అరుదైన దృశ్యం. మొబైల్ షాపుల ద్వారా వ్యాపార విజయం సాధిస్తూ, ఇంట్లో మాత్రం 'నో ఫోన్ జోన్'లో పిల్లలకు సంస్కారాలను అందిస్తూ ప్రేమాభిమానాలతో జీవిస్తున్న ఈ కుటుంబం నిజంగా సమాజానికి ఆదర్శంగా నిలుస్తోంది".

- నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)




## హార్టీ కంగ్రాట్స్ అండ్ హాపీ బర్త్ డే శివా.!!

### 'నో ఫోన్ జోన్' - పిల్లల కోసం ప్రత్యేక నిర్ణయం

ఈ హైటెక్ యుగంలో చిన్న పిల్లలు స్మార్ట్ ఫోన్లకు బానిసలవుతున్న సమయంలో మార్త కుటుంబం ఒక ప్రత్యేక నిర్ణయం తీసుకుంది. ఇంట్లో పిల్లలకు స్మార్ట్ ఫోన్లు ఉపయోగించనివ్వరు. ఇంటి ఆడవారికి 'కీ ప్యాడ్ ఫోన్'లను ఇవ్వడం విశేషం.'స్మార్ట్ ఫోన్'ల ద్వారా మంచి కంటే చెడు ఎక్కువ జరుగుతుందని..బంధాలు దూరమవుతాయని శివ భావన.! చదువు, ఆటలు, కుటుంబంతో గడిపే సమయం -- ఇవే వారికి ముఖ్యమని పెద్దలు భావిస్తున్నారు. ఫలితంగా పిల్లలు ప్రేమ, ఆప్యాయతల మధ్య పెరుగుతూ మంచి సంస్కారాలతో ఎదుగుతున్నారు.

### కోడళ్ల ఐక్యత-కుటుంబానికి అదనపు బలం

ఈ కుటుంబంలో కోడళ్లు కూడా ప్రత్యేక పాత్ర పోషిస్తున్నారు. ఒక కడుపున పుట్టిన అక్కాచెల్లెళ్లలా కలిసిమెలిసి జీవిస్తూ కుటుంబ ఐక్యతను మరింత బలపరుస్తున్నారు. ఇంట్లో ఎలాంటి విభేదాలు లేకుండా పెద్దల మాటను గౌరవిస్తూ జీవించడం ఈ కుటుంబానికి ప్రత్యేకతగా నిలుస్తోంది. తమకు తోడుగా త్వరలో రాబోయే 'చిన్న కోడలు' కూడా తమలాగే అందరితో కలిసిపోయేలా ఉండాలని.. అలాంటి లక్షణాలున్న అమ్మాయికోసం అన్వేషిస్తుండడం గమనార్హం.

### వ్యాపార విజయం-విస్తరిస్తున్న కార్యకలాపాలు

మొబైల్ వ్యాపారంతో ప్రారంభమైన మార్త శివ కుటుంబం ప్రస్తుతం ఇతర రంగాల్లో కూడా అడుగులు వేస్తోంది. హైదరాబాద్‌లో 'రియల్ ఎస్టేట్' వ్యాపారం, కోరుట్ల శివారులో 'కోణార్క్ ఫంక్షన్ హాల్' నిర్వహణ వంటి వ్యాపారాల్లో కూడా ఈ కుటుంబం ముందుకు సాగుతోంది. వ్యాపారాల్లో పనిచేసే ఉద్యోగులను కూడా తమ సొంత కుటుంబ సభ్యుల్లా చూసుకోవడం ఈ కుటుంబం ప్రత్యేకతగా చెబుతారు.మూడు షాపుల్లో కలిపి మొత్తం 14 మందికి ఉపాధినివ్వడమే గాకుండా..వారందరినీ సొంత తమ్ముళ్లగా చూసుకుంటుండడం అభినందించదగ్గ విషయం.!

### రాజకీయ-సామాజిక అనుబంధాలు

ఈ కుటుంబానికి సామాజిక, రాజకీయ వర్గాల్లో కూడా మంచి పరిచయాలు ఉన్నాయి.హుజూరబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తరగతి మిత్రులుగా ఉండటం, మంత్రి కొండా సురేఖ కుటుంబంతో బంధుత్వం.. శివకుమార్ కు మేనత్త అవుతుంది. అదేవిధంగా మినిస్టర్ శ్రీధర్ బాబుకు శివ అత్యంత దగ్గరి శిష్యుడు.ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు అత్యంత సన్నిహితుడు.కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంఛార్జి జువ్వాడి నర్సింగరావుకు అనుచరులు.వీరితో పాటు పలువురు నాయకులతో సన్నిహిత సంబంధాలు ఈ కుటుంబానికి ఉన్నాయి.

## ఉద్యోగులు కూడా కుటుంబ సభ్యులే.!

### (ఇదే వారి అడ్మినిస్ట్రేషన్ రహస్యం)

వ్యాపార సంస్థల్లో పనిచేసే ప్రతి ఉద్యోగిని సొంత తమ్ముడిలా చూసుకోవడం, వారి సమస్యలు వినడం, సంతోషాల్లో పాలుపంచుకోవడం.. ఇది మార్త కుటుంబం ప్రత్యేకత.! పెద్దన్న శివకుమార్ నాయకత్వం ఇక్కడే కనిపిస్తుంది. 'కుటుంబం ఒకటైతే వ్యాపారం స్వయంగా వృద్ధి చెందుతుంది' అనే సూత్రాన్ని వారు ఆచరణలో చూపిస్తున్నారు. ఇలాంటి ఉమ్మడి కుటుంబాలు ఇప్పుడు చాలా అరుదు. కానీ మార్త శివకుమార్ కుటుంబం దీనిని కేవలం సాధించడమే కాకుండా, తన వ్యాపారం, సేవ, సంబంధాల ద్వారా సమాజానికి ఒక మార్గదర్శకంగా నిలుస్తోంది. ఈ కుటుంబం చూపించిన ఐక్యత, ప్రేమ, బాధ్యతాభావం..ఇవి భవిష్యత్ తరాలకు ఒక గొప్ప వారసత్వం.!



### - సేవా కార్యక్రమాల్లోనూ ముందంజ

'మార్త శివ' కుటుంబం వ్యాపారాల్లోనే కాకుండా సేవా కార్యక్రమాల్లో కూడా ముందుంటుంది.అన్నదానాలు, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పేదలకు సహాయం చేయడం, ఆపదలో ఉన్నవారికి తోడుగా నిలవడం ఈ కుటుంబం ప్రధాన లక్షణంగా నిలుస్తోంది.

### సమాజానికి ఆదర్శం!

ప్రస్తుత కాలంలో కుటుంబ బంధాలు క్రమంగా క్షీణిస్తున్న సందర్భంలో 'మార్త శివ' కుటుంబం ఒక మంచి ఉదాహరణగా నిలుస్తోంది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో ప్రేమ, పరస్పర గౌరవం, బాధ్యతలు పంచుకోవడం వంటి విలువలు ఉంటే ఎంత పెద్ద కుటుంబమైనా సంతోషంగా జీవించవచ్చని ఈ కుటుంబం నిరూపిస్తోంది. అన్నదమ్ముల ఐక్యత, తల్లి నాయకత్వం, కుటుంబ సభ్యుల పరస్పర సహకారం - ఇవన్నీ కలిసే 'మార్త శివ కుమార్' కుటుంబాన్ని సమాజానికి ఆదర్శంగా నిలబెడుతున్నాయని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు..

'ఎనీ హౌ.. హార్టీ కంగ్రాట్స్ అండ్ హాపీ బర్త్‌డే' శివా!



నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI
కరీంనగర్ | గురువారం 12 మార్చి 2026

# ప్రకృతి గర్భగుడి

మన హృదయం ప్రకృతి గర్భగుడిగా మారిన వేళ,
వర్షపు చినుకులు అభిషేకాలై జలజలా కురిశాయి.
గాలుల సున్నిత నాదం మంత్రోచ్ఛారణగా వినిపించగా,
పక్షుల గానధారలు ఘంటానాదాలై మార్మోగాయి.

భూమి ఒడిలో మొలిచిన ప్రతి పచ్చ మొగ్గ
దైవసాన్నిధ్యపు మౌన ప్రతిమగా నిలిచింది.
సూర్యకిరణాలు హారతులై వెలుగులు చిందించగా,
చంద్రకాంతి కరుణా ప్రసాదంలా జాలువారింది.

కానీ..
మనిషి మనసులో మొలిచిన స్వార్థపు ముళ్లు
ఆ ప్రకృతి గర్భగుడిని గాయపరిచాయి.
అసూయ అనే అగ్నికణం ఎగసి పడిన వేళ
హృదయ పవిత్రత బూడిదగా మారింది.

అహంకారం అనే అంధకారం కమ్ముకున్నప్పుడు
ఆత్మదీపం మసకబారింది.
ద్వేషం అనే విషగాలి వీచిన క్షణంలో
జీవన వనమే వాడిపోయింది.

అడవులను నరికిన కత్తుల ధ్వని
మనిషి ఊపిరినే మూలం నుంచి కోసేసింది.
పక్షుల గానాలు నిశ్శబ్దంలో కలిసిపోతూ
ప్రకృతి ఆలయం శూన్యంగా మారింది.

మన హృదయం మళ్లీ పవిత్రమైతేనే
ప్రకృతి గర్భగుడి తిరిగి వెలుగుతుంది.
మన ప్రేమే హారతి, మన కరుణే పూజగా మారితే
ఈ భూమి మళ్లీ దైవాలయంగా వికసిస్తుంది.

ప్రకృతిని కాపాడుదాం...

శ్రీమతి మంజుల పత్తిపాటి
కవయిత్రి



మాజీ డైరెక్టర్, ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ
యాదాద్రి భువనగిరి జిల్లా, తెలంగాణ రాష్ట్రం
చరవాణి: 9347042218

# కోరుట్ల వేంకటేశ్వరస్వామి ఆలయ భూమిని కాపాడండి

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు విన్నవించిన కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్



**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన ఎండోమెంట్స్ భూమిని రక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. దేవాలయానికి చెందిన విలువైన భూమిపై జరుగుతున్న ఆక్రమణలను తొలగించి ఆలయ ఆస్తులను పరిరక్షించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కోరుట్ల పట్టణంలోని సర్వే నంబర్ 1497లో సుమారు 3.17 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన భూమి ఎండోమెంట్స్ శాఖ పరిధిలో ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ భూమి దేవాలయ అభివృద్ధి కార్యక్రమాలు మరియు ఆలయ అవసరాల కోసం ఉపయోగపడాల్సి ఉందని పేర్కొన్నారు. అయితే ఈ భూమిని కొంతమంది వ్యక్తులు అక్రమంగా ఆక్రమించుకున్నారని ఎమ్మెల్యే తెలిపారు. దేవాలయానికి చెందిన విలువైన భూములపై ఈ తరహా ఆక్రమణలు జరగడం ఆలయ పరిపాలనకు నష్టం కలిగించడమే కాకుండా భక్తుల మనోభావాలను కూడా దెబ్బతీస్తుందని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత రెవెన్యూ మరియు ఎండోమెంట్స్ శాఖ అధికారులతో కలిసి పూర్తి స్థాయి సర్వే నిర్వహించి భూమి సరిహద్దులను స్పష్టంగా గుర్తించాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే డిమార్కేషన్ చేసి ఆక్రమణలను తొలగించే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మరియు సంబంధిత అధికారులను కోరారు. భవిష్యత్తులో దేవాలయ భూములపై మరిన్ని ఆక్రమణలు జరగకుండా తగిన రక్షణ చర్యలు కూడా చేపట్టాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ అంశాన్ని అత్యవసరంగా పరిశీలించి దేవాలయ ఆస్తిని పరిరక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

# దుబాయ్‌లో చికిత్స పొందుతూ కోరుట్ల యువకుడు మృతి



## మంగళవారం అక్కడే అంత్యక్రియలు

### ప్రభుత్వాలు ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి

**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** ఉపాధి కోసం గల్ఫ్ దేశానికి వెళ్లిన కోరుట్ల పట్టణానికి చెందిన యువకుడు అనారోగ్యంతో మృతి చెందిన విషాద ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని కలిగించింది. కుటుంబాన్ని పోషించాలనే ఆశతో దుబాయ్‌కు వెళ్లిన అబ్దుల్ రహమాన్ (21) చికిత్స పొందుతూ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీటి మునిగిపోయారు.

### ఉపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లిన యువకుడు

కోరుట్లలోని మోమిన్‌పురకు చెందిన అబ్దుల్ రహమాన్ పేదరికంతో కుటుంబాన్ని పోషించేందుకు గత సంవత్సరం దుబాయ్‌కు వెళ్లాడు. కొద్ది రోజుల క్రితం ఆయన తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. అనారోగ్యంతో బాధపడుతున్న అబ్దుల్ రహమాన్ అక్కడే చికిత్స పొందుతూ ఈ నెల మార్చి 7న మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. మంగళవారం దుబాయ్‌లోనే ఆయన అంత్యక్రియలు నిర్వహించినట్లు తెలిసింది.

### ఒంటరైన తల్లి

మృతుడి తల్లి షఫాత్ బేగం తన కుమారుడిపైనే ఆధారపడి జీవనం సాగించేది. కుమారుడు మృతి చెందిన వార్త తెలిసిన వెంటనే ఆమె బోరున విలపించింది. 'ఇక్కడ పని లేక గల్ఫ్ దేశానికి వెళ్లి నా తల్లిని పోషిస్తాను, ఆమెను బాగా చూసుకుంటాను' అని చెప్పి వెళ్లిన నా కుమారుడు ఇలా అకాల మరణం చెందడం చాలా బాధగా ఉందని ఆమె కన్నీరుమున్నీరైంది. అబ్దుల్ రహమాన్ లాంటి పరిస్థితి ఎవరికీ రాకూడదని ఆవేదన వ్యక్తం చేసింది.

### ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి

ప్రస్తుతం షఫాత్ బేగంకు ఆదుకునే వారు ఎవరూ లేక తీవ్ర దుఃఖంలో ఉంది. ఈ నేపథ్యంలో మృతుడి తల్లికి భారత ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆమె జీవనానికి మార్గం చూపాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

# మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య సుడిగాలి పర్యటన



**నేటి సాక్షి, వికారాబాద్:** వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య జిల్లా కేంద్రంలో బుధవారం విస్తృతంగా పర్యటించారు. పట్టణంలోని బిజెఆర్ చౌరస్తా నుండి రామయ్యగూడ వరకు ఇటీవల శుభ్రం చేసిన ఓపెన్ డ్రైనేజీ పనులను ఆమె స్వయంగా పరిశీలించారు. అనంతరం 23వ వార్డు పరిధిలోని ఆలంపల్లి ఈద్గాను సందర్శించి, రంజాన్ పండుగ సందర్భంగా నిర్వహించే ప్రత్యేక ప్రార్థనల కోసం ముందస్తు ఏర్పాట్లను సమీక్షించారు. ప్రార్థనలకు వచ్చే ముస్లిం సోదరులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అక్కడి నుండి ఆలంపల్లి బోనమ్మగుంత దేవాలయానికి చేరుకున్న అనన్య, ఆలయ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. భక్తుల కోసం అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అలాగే అనంతగిరి రోడ్డులోని లైబ్రరీ పక్కన ఉన్న పబ్లిక్ టాయిలెట్లను తనిఖీ చేసి, వాటిని నిత్యం శుభ్రంగా ఉంచాలని నిర్వాహకులను ఆదేశించారు. పర్యటనలో భాగంగా 29వ వార్డు మిషన్ కాంపౌండ్‌లోని ప్రభుత్వ గిరిజన బాలికల వసతి గృహాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ కిచెన్ మరియు గదులను పరిశీలించిన చైర్‌పర్సన్, విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందిస్తున్నారా లేదా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. బాలికల ఆరోగ్య విషయంలో రాజీ పడకూడదని, మెనూను కచ్చితంగా పాటించాలని సిబ్బందిని హెచ్చరించారు. ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డి, వార్డు కౌన్సిలర్లు, స్థానిక నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# లైసెన్స్‌డ్ సర్వేయర్లను రోడ్డున పడేసిన కాంగ్రెస్ సర్కార్

- హామీ ఇచ్చి 8 నెలలైనా బాధ్యతలు లేవు.. వేతనాలు లేవు
- నిరుద్యోగులను నట్టేట ముంచిన రేవంత్ రెడ్డి
- మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



నేటి సాక్షి, వికారాబాద్: ఎన్నికల ముందు నిరుద్యోగులకు కోటి ఆశలు కల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక లైసెన్స్‌డ్ సర్వేయర్లను అయోమయంలో నెట్టిందని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్ మండిపడ్డారు. గురువారం వికారాబాద్ నియోజకవర్గానికి చెందిన 97 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లు ఆయనను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లకు బాధ్యతలు అప్పగిస్తామని హామీ ఇచ్చి ఎనిమిది నెలలు గడిచినా, నేటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని డాక్టర్ మెతుకు ఆనంద్ విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు పదివేల మంది సర్వేయర్లు విధుల్లేక, వేతనాలు అందక రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని, నిరుద్యోగుల పట్ల ఆ పార్టీ మోసబుద్ధి మరోసారి బయటపడిందని దుయ్యబట్టారు. ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ అశోక్ నగర్ చౌరస్తాలో కూర్చుని నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు ఇప్పుడు ఎందుకు గుర్తుకు రావడం లేదని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తన కుర్చీని కాపాడుకోవడానికే సమయం సరిపోతోందని, ప్రజా సంక్షేమంపై ఆయనకు ఏమాత్రం ధ్యాస లేదని ఎద్దేవా చేశారు. గౌరవ స్పీకర్ గారు ఈ విషయంలో జోక్యం చేసుకుని సర్వేయర్లకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ తరపున లైసెన్స్‌డ్ సర్వేయర్ల పక్షాన నిలబడతామని, తక్షణమే వారికి బాధ్యతలు అప్పగించి వేతనాలు చెల్లించాలని మెతుకు ఆనంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు గోపాల్ ముదిరాజ్, సీనియర్ నాయకులు మేక చంద్రశేఖర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, గాండ్ల మల్లికార్జున్, సర్వేయర్ల మండల అధ్యక్షుడు శ్యామ్ మరియు పలువురు సర్వేయర్లు పాల్గొన్నారు.

# బుగ్గారం వాసికి "కళా రత్న నేషనల్ అవార్డ్"

## ఈనెల 15న తిరుపతిలో అవార్డ్ అందుకోనున్న "నక్క పోచ రాజయ్య"

**బుగ్గారం, జగిత్యాల జిల్లా:** జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రానికి చెందిన ప్రముఖ విద్యావేత్త నక్క పోచ రాజయ్య అలియాస్ నక్క రాజు "కళా రత్న నేషనల్ అవార్డ్" కు ఎంపికయ్యారు. బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ జారీ చేసిన ఇట్టి అవార్డ్ ఎంపిక పత్రం ను అవార్డుల సెలెక్షన్ కమిటి సభ్యుడు చుక్క గంగారెడ్డి మంగళ వారం నక్క పోచ రాజయ్య ( నక్క రాజు) కు అందజేశారు. ఈనెల 15 ఆదివారం ఉదయం తిరుపతిలో జరుగనున్న బహుజన సాహిత్య అకాడమీ 18వ జాతీయ స్థాయి కాన్ఫరెన్స్ (అవార్డుల ప్రధానోత్సవ సభ)లో ఇట్టి అవార్డ్ ను అందజేయనున్నట్లు జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ అట్టి ఎంపిక పత్రంలో పేర్కొన్నారు. ఇప్పటికే ఆధ్యాత్మిక ఉద్యమ కళాకారుడిగా పేరు ప్రఖ్యాతులు పొంది, విద్యారత్న జాతీయ అవార్డ్, నంది అవార్డులతో పాటు డాక్టరేట్ కూడా సాధించిన నక్క పోచ రాజయ్య ( నక్క రాజు) నేడు "కళారత్న నేషనల్ అవార్డ్" కు కూడా ఎంపిక కావడం పట్ల బుగ్గారం మండల ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, విద్యావంతులు, బంధు మిత్రులు, శ్రేయోభిలాషులు నక్క పోచ రాజయ్య ( నక్క రాజు) ను అభినందిస్తున్నారు.

# విద్యార్థుల వనభోజనాలు

**నేటి సాక్షి-మేడిపల్లి:** మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గోవిందారంనకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు ఈరోజు గ్రామ శివారులోని మామిడి తోటలోకి వనభోజనాలకు వెళ్లారు. ఆటలు పాటలతో బాగా సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీయాల మధుసూదన్ రెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ వెంకటరమణ, సర్పంచ్ పుల్లూరి ఉమారాణి దేవయ్య, ఏపీసీ చైర్మన్ శ్రీమతి పేటలావణ్య నారాయణ, ఉప సర్పంచ్ బింగి స్వామి, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కొవ్వొత్తులతో సావిత్రిబాయి



## మిచెల్‌కు క్షమాపణ చెప్పాల్సిన
# అవసరం లేదు!

### అర్ష్‌దీప్ సింగ్‌ను వెనకేసుకొచ్చిన గంభీర్..

**ఢిల్లీ:** అర్ష్‌దీప్ సింగ్ మరియు మిచెల్ మధ్య జరిగిన వాగ్వాదంపై టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అర్ష్‌దీప్ సింగ్.. మిచెల్‌కు క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదని గంభీర్ స్పష్టం చేశారు. కాగా, ఈ ఘటన టీ20 వరల్డ్‌కప్ 2026 ఫైనల్ సందర్భంగా అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగింది. న్యూజిలాండ్ ఇన్నింగ్స్ సమయంలో మిచెల్ వరుసగా రెండు సిక్సర్లు కొట్టాడు. ఆ తర్వాత క్రీజ్ బయటకు వచ్చిన మిచెల్‌ను రనౌట్ చేయడానికి అర్ష్‌దీప్ ప్రయత్నించాడు. అయితే బంతి స్టంప్స్‌ను తాకకుండా మిచెల్ తొడను తాకింది. దీంతో ఇద్దరి మధ్య మైదానంలో స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. మ్యాచ్ అనంతరం తాను విసిరిన త్రో ఉద్దేశపూర్వకంగా కాదని అర్ష్‌దీప్ సింగ్ స్పష్టం చేస్తూ మిచెల్‌కు క్షమాపణలు చెప్పాడు.

### గంభీర్ వ్యాఖ్యలు..

ఈ విషయంపై టీమిండియా హెడ్ కోడ్ గౌతమ్ గంభీర్ మాట్లాడుతూ.. దేశం కోసం ఆడేటప్పుడు ఆటగాళ్లు దూకుడుగా ఉండటం సహజమని అన్నారు. వరుసగా రెండు సిక్సర్లు కొట్టినప్పుడు బౌలర్ నుంచి ప్రతిస్పందన రావడం సాధారణమని చెప్పారు. క్షమాపణ చెప్పకపోయినా ఎలాంటి సమస్య ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే గతంలో కూడా ఇలాంటి ఘటనలు జరిగేవని, అయితే ఇప్పుడు సోషల్ మీడియా కారణంగా ప్రతి చిన్న విషయం కూడా పెద్దగా మారుతోందని గంభీర్ వ్యాఖ్యానించారు.

### ఐసీసీ జరిమానా

ఈ ఘటన తర్వాత ఇంటర్నేషనల్‌క్రికెట్‌కౌన్సిల్‌అర్ష్‌దీప్ సింగ్‌పై మ్యాచ్ ఫీజులో 15 శాతం జరిమానా విధించింది. అదేవిధంగా ఒక డీమెరిట్ పాయింట్ కూడా ఇచ్చింది. అయితే గత 24 నెలల్లో ఇది మొదటి తప్పు కావడంతో అతనిపై పెద్ద శిక్ష విధించలేదు.



# ఐపీఎల్2026 షెడ్యూల్ రిలీజ్

## మార్చి 28 నుంచి ప్రారంభం

- తొలి మ్యాచ్‌లోనే ఆర్సీబీ వర్సెస్ ఎస్ఆర్ హెచ్ హై వోల్టేజ్ పోరు
- హైదరాబాద్‌లో ఒక్క మ్యాచ్ మాత్రమే
- ముంబై, చెన్నై, గువహటి వేదికగా కీలక మ్యాచ్‌లు

**ఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సందడికి సమయం ఆసన్నమైంది. క్రికెట్ ప్రపంచంలోనే అత్యంత ఆదరణ పొందిన ఈ మెగా టోర్నీకి సంబంధించి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) బుధవారం కీలక ప్రకటన చేసింది. టోర్నీలో భాగంగా మొదటి దశ షెడ్యూల్‌ను అధికారికంగా విడుదల చేసింది. మార్చి 28 నుంచి ప్రారంభం కానున్న ఈ సీజన్‌లో తొలి పోరులోనే అగ్రశ్రేణి జట్లు తలపడనుండటంతో అభిమానుల్లో అప్పుడే ఉత్కంఠ మొదలైంది. ఈ ఏడాది ఐపీఎల్ వేట బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా అత్యంత వైభవంగా ప్రారంభం కానుంది. మార్చి 28న రాత్రి 7:30 గంటలకు జరిగే ప్రారంభ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్ హెచ్) జట్లు తలపడనున్నాయి. గత సీజన్‌లో భారీ స్కోర్లతో సంచలనం సృష్టించిన సన్‌రైజర్స్, ఈసారి తొలి మ్యాచ్‌లోనే ఆర్సీబీతో డిఫెండింగ్ ఛాంపియన్ తో తలపడనుండటం గమనార్హం. కేవలం తొలి 20 మ్యాచ్‌లకు సంబంధించి మాత్రమే షెడ్యూల్‌ను ప్రకటించిన బీసీసీఐ, మిగిలిన దశల వివరాలను త్వరలోనే వెల్లడించనుంది.




TATA IPL 2026 SCHEDULE

| MATCH | DATE | DAY | TIME | VENUE |
|---|---|---|---|---|
| RCB vs SRH | 28-Mar-26 | Sat | Evening | Bengaluru |
| MI vs KKR | 29-Mar-26 | Sun | Evening | Mumbai |
| RR vs CSK | 30-Mar-26 | Mon | Evening | Guwahati |
| PBKS vs GT | 31-Mar-26 | Tue | Evening | Mullanpur |
| LSG vs DC | 1-Apr-26 | Wed | Evening | Lucknow |
| KKR vs SRH | 2-Apr-26 | Thu | Evening | Kolkata |
| CSK vs PBKS | 3-Apr-26 | Fri | Evening | Chennai |
| DC vs MI | 4-Apr-26 | Sat | Afternoon | Delhi |
| GT vs RR | 4-Apr-26 | Sat | Evening | Ahmedabad |
| SRH vs LSG | 5-Apr-26 | Sun | Afternoon | Hyderabad |
| RCB vs CSK | 5-Apr-26 | Sun | Evening | Bengaluru |
| KKR vs PBKS | 6-Apr-26 | Mon | Evening | Kolkata |
| RR vs MI | 7-Apr-26 | Tue | Evening | Guwahati |
| DC vs GT | 8-Apr-26 | Wed | Evening | Delhi |
| KKR vs LSG | 9-Apr-26 | Thu | Evening | Kolkata |
| RR vs RCB | 10-Apr-26 | Fri | Evening | Guwahati |
| PBKS vs SRH | 11-Apr-26 | Sat | Afternoon | Mullanpur |
| CSK vs DC | 11-Apr-26 | Sat | Evening | Chennai |
| LSG vs GT | 12-Apr-26 | Sun | Afternoon | Lucknow |
| MI vs RCB | 12-Apr-26 | Sun | Evening | Mumbai |

సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు దేశవ్యాప్తంగా విపరీతమైన క్రేజ్ ఉన్నప్పటికీ, తాజా షెడ్యూల్ భాగ్యనగర వాసులను కొంత నిరాశకు గురిచేసింది. విడుదలైన మొదటి దశ షెడ్యూల్ ప్రకారం, హైదరాబాద్‌లోని ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియం (ఆర్జీఐఎస్) కేవలం ఒక్క మ్యాచ్‌కు మాత్రమే ఆతిథ్యం ఇవ్వనుంది. ఏప్రిల్ 5వ తేదీ మధ్యాహ్నం 3:30 గంటలకు సన్‌రైజర్స్ హైదరాబాద్, లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్జీ) మధ్య ఈ మ్యాచ్ జరగనుంది. హోమ్ గ్రౌండ్‌లో తమ జట్టు ఆటను చూడాలని ఆశగా ఎదురుచూస్తున్న అభిమానులకు ఇది మింగుడుపడని విషయమే అయినప్పటికీ, రెండవ దశ షెడ్యూల్‌లో ఉప్పల్ స్టేడియానికి మరిన్ని మ్యాచ్‌లు కేటాయించే అవకాశం ఉంది.

షెడ్యూల్ ప్రకారం మార్చి 29న ముంబైలోని వాంఖడే స్టేడియంలో ముంబై ఇండియన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్లు తలపడతాయి. అలాగే మార్చి 30న గువాహటి వేదికగా రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య మ్యాచ్ జరగనుంది. ఏప్రిల్ 5వ తేదీ క్రికెట్ ప్రియులకు డబుల్ ధమాకా అందనుంది. మధ్యాహ్నం హైదరాబాద్‌లో ఎస్ఆర్‌హెచ్ జం ఎల్ఎస్‌జీ మ్యాచ్ జరుగుతుండగా, అదే రోజు రాత్రి బెంగళూరులో ఆర్‌సీబీ, చెన్నై సూపర్ కింగ్స్ (జూఖ) జట్ల మధ్య హై-వోల్టేజ్ పోరు జరగనుంది. మొత్తంగా ఏప్రిల్ 12వ తేదీ వరకు జరిగే ఈ మొదటి దశలో అన్ని ప్రధాన జట్లు తమ బలాబలాలను నిరూపించుకోవడానికి సిద్ధమవుతున్నాయి.

# దూబే సాహసం

### మాస్క్ ధరించి.. థర్డ్ ఏసీలో సామాన్యుడిలా ప్రయాణం!



**ఢిల్లీ:** భారత క్రికెట్ జట్టు టీ20 ప్రపంచకప్‌ను ముచ్చటగా మూడోసారి ముద్దాడి చరిత్ర సృష్టించిన వేళ, టీమ్ ఇండియా స్టార్ ఆల్ రౌండర్ శివమ్ దూబేకు సంబంధించిన ఒక ఆసక్తికరమైన వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఆఖరి ఓవర్లో 24 పరుగులు పిండుకుని, భారత్‌ను విజేతగా నిలిపిన శివమ్ దూబే.. అహ్మదాబాద్ నుంచి ముంబైకి రైలులో ప్రయాణించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రపంచకప్ గెలిచిన ఉత్సాహంలో దేశమంతా సంబరాలు చేసుకుంటుండగా, ఈ 'వరల్డ్ కప్ హీరో' మాత్రం తన కుటుంబాన్ని చేరుకోవడానికి పడ్డ తపన ఇప్పుడు చర్చనీయాంశమైంది.

### విమానంలో టిక్కెట్లు లేక.. రైలు ప్రయాణం

మ్యాచ్ ముగిసిన తర్వాత తన నాలుగేళ్ల కుమారుడు అయాన్, రెండేళ్ల కుమార్తె మహవిష్‌లను చూడటానికి దూబే ముంబై వెళ్లేందుకు విమాన టిక్కెట్లు ప్రయత్నించగా సీట్లు దొరకలేదు. రోడ్డు మార్గంలో వెళ్లడం కంటే రైలు ప్రయాణం వేగంగా ఉంటుందని భావించి, తన భార్య అంజుమ్‌తో కలిసి సయాజీ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించాలని నిర్ణయించుకున్నారు.

### గుర్తుపట్టకుండా జాగ్రత్తలు:

ప్రపంచకప్ గెలిచిన స్టార్‌ను రైలులో చూస్తే జనం ఎగబడతారని తెలుసు. అందుకే దూబే ఒక పక్కా ప్లాన్ వేశారు. ముఖానికి మాస్క్, తలపై టోపీ, ఫుల్ హ్యాండ్స్ టీ-షర్ట్ ధరించి గుర్తుపట్టకుండా జాగ్రత్త పడ్డారు. స్టేషన్‌లో రద్దీని తట్టుకోవడానికి, రైలు బయలుదేరడానికి సరిగ్గా ఐదు నిమిషాల ముందు కారు దిగి వేగంగా లోపలికి వెళ్లారు. ఆయనకు థర్డ్ ఏసీలో అప్పర్ బెర్త్ దొరికింది. ప్రయాణమంతా ఎవరికీ కనిపించకుండా అక్కడే ఉండిపోయారు. ప్రయాణంలో టికెట్ చెకర్ వచ్చినప్పుడు ఒక ఆసక్తికర సంఘటన జరిగింది. టికెట్‌పై పేరు చూసి.. "శివమ్ దూబేనా? అంటే ఆ క్రికెటరా?" అని టిటిఈ ఆశ్చర్యంగా అడిగారు. వెంటనే దూబే భార్య అంజుమ్ సమయస్ఫూర్తితో స్పందిస్తూ.. "కాదు కాదు.. ఆయన ఇక్కడికి ఎందుకు వస్తారు?" అని బదులిచ్చి విషయాన్ని దాటవేశారు. అలా ఆ స్టార్ క్రికెటర్ తన గుర్తింపు బయటపడకుండా సురక్షితంగా ముంబై చేరుకున్నారు. "నా స్నేహితులు, కుటుంబ సభ్యులు అంతా ఆందోళన చెందారు. కానీ నా పిల్లలను చూడాలనే ఆత్రుతతో ఈ రిస్క్ తీసుకున్నాను. థర్డ్ ఏసీలో ప్రయాణం ఒక కొత్త అనుభూతిని ఇచ్చింది" అని శివమ్ దూబే తన ప్రయాణం గురించి పంచుకున్నారు.

# పాకిస్తాన్ 114కే పరిమితం




### తొలి వన్డేలో ఆతిథ్య జట్టు చేతిలో ఓటమి

### 8 వికెట్ల తేడాతో ఓడించిన బంగ్లాదేశ్

**మీర్‌పూర్:** మీర్‌పూర్‌లోని షేర్-ఎ-బంగ్లా స్టేడియంలో జరిగిన సిరీస్‌లోని మొదటి వన్డేలో బంగ్లాదేశ్ 8 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌ను ఓడించింది. టాస్ గెలిచిన ఆతిథ్య జట్టు షాహీన్ షా అఫ్రిది జట్టును ముందుగా బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. బ్యాటింగ్ చేస్తున్నప్పుడు పాకిస్తాన్ మంచి ఆరంభం ఇవ్వడానికి ప్రయత్నించింది, కానీ మొదటి వికెట్ 41 పరుగుల వద్ద సాహిబ్జాదా ఫర్హాన్ (27) రూపంలో పడిపోయింది. జట్టు కోలుకోకముందే, షమిల్ హుస్సేన్ కూడా 4 పరుగులు చేసి పెవిలియన్‌కు తిరిగి వచ్చాడు. దీని తర్వాత, బంగ్లాదేశ్ బౌలర్లు విధ్వంసం సృష్టించడం ప్రారంభించారు. పర్యాటక జట్టు వికెట్లు క్రమం తప్పకుండా పడిపోయాయి. ముహాజ్ సదాకత్ 18, మహ్మద్ రిజ్వాన్ 10, సల్మాన్ అలీ ఆఘా 5, హుస్సేన్ తలాత్ 4, అబ్దుల్ సమద్ 0, ఫహీమ్ అష్రఫ్ 37, షహీన్ అఫ్రిది 4, మహ్మద్ వసీం 0, అబ్రార్ అహ్మద్ 0 పరుగులు చేశారు. అందువలన, మొత్తం జట్టు 30.4 ఓవర్లలో 114 పరుగులు మాత్రమే చేయగలిగింది. బంగ్లాదేశ్ బౌలర్ నహిద్ రాణా పాకిస్తాన్‌ను వణికించాడు. 7 ఓవర్లలో 3.42 ఎకానమీ రేటుతో 24 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. మెహదీ హసన్ మీర్జా షహీన్ షా అఫ్రిది జట్టులోని ముగ్గురు బ్యాట్స్‌మెన్‌లను అవుట్ చేయడం ద్వారా మిగిలిన పనిని పూర్తి చేశాడు. తస్కిన్ అహ్మద్, ముస్తాఫిజుర్ రెహమాన్ తలా ఒక వికెట్ తీశారు. 115 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో బంగ్లాదేశ్ బ్యాట్స్‌మెన్ పెద్దగా ఇబ్బంది పడలేదు. ఓపెనర్ సైఫ్ హసన్ కేవలం 4 పరుగులకే ఔటైనా, తంజిద్ హసన్ 42 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్సర్లతో 67 పరుగులు చేసి అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. నజ్ముల్ హసన్ శాంటో 27 పరుగులు సాధించాడు. 15.1 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి టార్గెట్ పూర్తి చేశారు.

## టీ20 ర్యాంకింగ్స్‌లోనూ భారత్ డామినేషన్..

### అభిషేక్, ఇషాన్ కిషన్ అరాచకం!

భారత్ టీ20 వరల్డ్ కప్‌లో ఘన విజయం సాధించి మూడోసారి ట్రోఫీని కైవసం చేసుకుంది. మూడోసారి ఐసీసీ టీ20 వరల్డ్ కప్పును కైవసం చేసుకున్న ఏకైక టీమ్‌గా భారత జట్టు నిలిచింది. అంతేకాదు.. ఐసీసీ తాజాగా రిలీజ్ చేసిన అంతర్జాతీయ టీ20 ర్యాంకుల్లోనూ టీమిండియా ప్లేయర్లు చోటు సాధించారు. ఈ మెగా టోర్నీలో మన ఆటగాళ్ల వీరోచిత ప్రదర్శన తాజాగా విడుదలైన టీ20 ర్యాంకింగ్స్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. బ్యాటింగ్ విభాగంలో టాప్-2 స్థానాలను టీమిండియానే కైవసం చేసుకుంది. ఈ సీజన్‌లో తన ఫామ్‌పై ఎన్నో విమర్శలు ఎదుర్కొన్న అభిషేక్ టాప్ 1 స్థానంలోనే కొనసాగుతున్నాడు. ఈ టోర్నీలో 317 పరుగులతో చెలరేగిన ఇషాన్ కిషన్ రెండు స్థానాలు ఎగబాకి సెకండ్ స్థానంలోకి చేరాడు. వీరిద్దరి మధ్య కేవలం నాలుగు రేటింగ్ పాయింట్ల తేడా మాత్రమే ఉంది. ఇక ఈ సీజన్‌లో ఎంతో ప్రతిభ కనబరిచిన సంజు శామ్సన్ 22వ ర్యాంక్‌లో కొనసాగుతుండగా.. శివమ్ దూబే 27వ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు.



# ప్రభాస్‌తో ఎకో డైరెక్టర్ ఫోటో

## కొత్త మూవీ చర్చలంటూ హల్‌చల్

ప్రస్తుతం సోషల్ మీడియాలో రెబల్ స్టార్ ప్రభాస్ మరియు మలయాళ సెన్సేషనల్ డైరెక్టర్ దిన్‌జిత్ అయ్యతాన్ కలిసి ఉన్న ఒక ఫోటో తెగ వైరల్ అవుతోంది. ఈ ఫోటో వీరిద్దరి కాంబినేషన్‌లో ఒక భారీ ప్రాజెక్ట్ పట్టాలెక్కబోతుందనే వార్తలకు బలం చేకురుస్తుంది. ఇటీవల 'కిష్కింధ కాండం' మరియు 'ఏకో' వంటి విభిన్నమైన సైకలాజికల్ థ్రిల్లర్ చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన దిన్‌జిత్, స్వయంగా ప్రభాస్‌ను కలిసిన విషయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ప్రభాస్ ఆతిథ్యాన్ని, ముఖ్యంగా ఆయన వడ్డించిన రుచికరమైన 'ప్రాన్స్ బిర్యానీ'ని ప్రశంసిస్తూ దిన్‌జిత్ పెట్టిన ఇన్స్టాగ్రామ్ పోస్ట్ ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్ అయింది. ముఖ్యంగా ఈ సమావేశం వెనుక హోంబలే ఫిల్మ్స్ అధినేత విజయ్ కిరగందూర్ ఉండటం గమనార్హం. గతంలోనే హోంబలే సంస్థ ప్రభాస్‌తో మూడు సినిమాల భారీ ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో 'సలార్ 2' కాకుండా, మిగిలిన రెండు చిత్రాల్లో ఒకటి దిన్‌జిత్ దర్శకత్వంలో ఉండే అవకాశం ఉందని ఫిల్మ్ నగర్ టాక్ నడుస్తుంది. విలక్షణమైన థ్రిల్లర్లను తెరకెక్కించడంలో దిన్‌జిత్ సిద్ధహస్తుడు కావడంతో, ప్రభాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా ఒక సరికొత్త తరహా కథను ఆయన సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. అయితే, ప్రస్తుతం ప్రభాస్ 'ఫౌజీ', 'స్పిరిట్' మరియు 'కల్కి 2' వంటి భారీ ప్రాజెక్టులతో ఎంతో బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈ క్రేజీ కాంబో ఎప్పుడు సెట్స్ పైకి వెళ్తుందనే దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. అధికారిక ప్రకటన రానప్పటికీ, ఈ ఇద్దరి కలయికతో ఒక డిఫరెంట్ సినిమాను చూడవచ్చని అభిమానులు ఆశిస్తున్నారు.



# జునైద్ ఖాన్‌తో సాయిపల్లవి జోడీ

## ఏక్ దిన్ ట్రైలర్ విడుదల

బాలీవుడ్ స్టార్ ఆమిర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్, సౌత్ సెన్సేషన్ సాయి పల్లవి జంటగా నటించిన క్రేజీ చిత్రం 'ఏక్ దిన్'. ఈ సినిమా ట్రైలర్‌ను చిత్రబృందంవిడుదల చేసింది. ఈ సినిమాకు సునీల్ పాండే దర్శకత్వం వహిస్తుండగా ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తుంది. హీరోయిన్ కేవలం ఒకే ఒక రోజు హీరోతో ప్రేమలో గడపాలనే ఆసక్తికరమైన కథాంశంతో ఈ సినిమా రాబోతుండగా.. ఈ చిత్రం ద్వారా సాయి పల్లవి హిందీ తెరకు పరిచయం కాబోతోంది. రామ్ సంపత్ సంగీతం, అరిజిత్ సింగ్ గాత్రం ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం మే 1, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేసేందుకు సిద్ధమవుతోంది.





# పొరపాటు కామెంట్స్

## మహేశ్ అభిమానులకు హరీష్ క్షమాపణలు


సూపర్ స్టార్ మహేష్ బాబు అభిమానులకు దర్శకుడు హరీష్ శంకర్ క్షమాపణలు చెప్పాడు. 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్ర ప్రమోషన్స్ సమయంలో జరిగిన ఒక చిన్న పొరపాటు ఈ వివాదానికి దారితీసిన విషయం తెలిసిందే. పవన్ కళ్యాణ్ అభిమాని ఒకరు ఎక్స్ వేదికగా ఈ సినిమా మహేష్ బాబు రికార్డులను బద్దలు కొట్టాలనే అర్థం వచ్చేలా ఒక పోస్ట్ చేశారు. దీనికి హరీష్ శంకర్ రిప్లై ఇవ్వడంతో మహేష్ బాబు అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయన్ని ట్రోల్ చేయడం ప్రారంభించారు. ఈ వివాదం ముదరడంతో హరీష్ శంకర్ వెంటనే స్పందిస్తూ వివరణ ఇచ్చారు. షూటింగ్ పనుల్లో మరియు సెన్సార్ కార్యక్రమాల్లో బిజీగా ఉండటం వల్ల ఆ ట్వీట్‌ను పూర్తిగా చదవకుండానే, కేవలం అభిమాని ఉత్సాహాన్ని చూసి పొరపాటున స్పందించానని ఆయన పేర్కొన్నారు. తనకు మహేష్ బాబు అంటే ఎంతో గౌరవమని, గతంలో ఆయన నటించిన 'పోకిరి' సినిమా గురించి కూడా తాను ఎంతో పాజిటివ్‌గా మాట్లాడానని గుర్తుచేశారు. అంతేకాకుండా, రాజమౌళి- మహేష్ బాబు కాంబినేషన్‌లో రాబోతున్న సినిమా పెద్ద రికార్డులు సృష్టించాలని తాను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. తన రిప్లై వల్ల ఎవరి మనోభావాలైనా దెబ్బతిని ఉంటే బేషరతుగా క్షమాపణలు కోరుతున్నానని హరీష్ శంకర్ ప్రకటించారు. సినిమా విడుదల తేదీ దగ్గర పడుతున్న సమయంలో తాను కావాలని ఇలాంటి వివాదాలు చేసే వ్యక్తిని కాదని ఆయన స్పష్టం చేశారు.

# త్రిష, విజయ్‌లది వ్యక్తిగత వ్యవహారం

## నటి ఖుష్బూ కామెంట్

తమిళ స్టార్ నటుడు, తమిళ వెట్రీ కళగం అధినేత విజయ్ మరియు హీరోయిన్ త్రిషల వ్యక్తిగత జీవితంపై నటి, రాజకీయ నాయకురాలు ఖుష్బూ సుందర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఇటీవల చెన్నైలో జరిగిన ఒక వివాహ రిసెప్షన్‌కు విజయ్ త్రిష కలిసి ఒకే కారులో రావడం సోషల్ మీడియాలో పెద్ద దుమారం రేపిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా విజయ్ భార్య సంగీత విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారనే వార్తల మధ్య వీరిద్దరూ కలిసి కనిపించడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ వివాదంపై ఖుష్బూ స్పందిస్తూ.. ఇది పూర్తిగా వారి వ్యక్తిగత విషయమని, దానిని భూతద్దంలో చూడాల్సిన అవసరం లేదని పేర్కొంది. విజయ్, త్రిషల వ్యవహారంతో సామాన్య ప్రజలకు ఏం సంబంధం ఉంటుందో తనకు అర్థం కావడం లేదని.. అది వారి పర్సనల్ లైఫ్ అని, దానిని గౌరవించాలని సూచించింది. విజయ్ ప్రస్తుతం రాజకీయాల్లో చురుగ్గా ఉన్న నేపథ్యంలో ఈ వివాదం ఆయన ఇమేజ్‌పై ప్రభావం చూపుతుందా? అని అడగ్గా.. ప్రజలు చాలా తెలివైన వారు. ఎవరికి ఓటు వేయాలో వారికి తెలుసు. వ్యక్తిగత జీవితాన్ని రాజకీయాలతో ముడిపెట్టడం సరికాదు అని తెలిపింది. నటులైనా, రాజకీయ నాయకులైనా వారు కూడా మనలాగే సాధారణ మనుషులని, వారి ప్రైవసీని దెబ్బతీయడం సరికాదని ఈ సందర్భంగా ఖుష్బూ చెప్పుకొచ్చింది.





# ది ప్యారడైజ్ ఆయా షేర్ సాంగ్ పాపులర్





### మూవీలో నాని నేపథ్యంపై కాసర్ల ఫీలర్

నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ప్రస్తుతానికి 'ది పారడైజ్' అనే సినిమా రూపొందుతోంది. ఈ సినిమాను ఒక పూర్తిస్థాయి రా అండ్ రస్టిక్ సినిమాగా రూపొందిస్తున్నారు మేకర్స్. నాని కెరీర్‌లోనే మొట్టమొదటిసారిగా, ఎప్పుడూ ఊహించని విధంగా ఈ సినిమాలో ఒక రా అండ్ రస్టిక్ పాత్రలో కనిపిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన ప్రతి ప్రమోషనల్ కంటెంట్ బాగా వర్కవుట్ అయింది, ప్రేక్షకులలో అంచనాలు రేకెత్తించింది. ఇక తాజాగా రిలీజ్ అయిన 'ఆయా షేర్' సాంగ్ బాగా ప్రేక్షకులలోకి వెళ్ళింది. ముఖ్యంగా సాంగ్ భిన్నంగా ఉండడంతో, ఈ సాంగ్ వినేందుకు శ్రోతలు సైతం ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ సాంగ్ రాసిన లిరిక్ రైటర్ కాసర్ల శ్యామ్ మీడియాతో ఈ సాంగ్ విశేషాలు పంచుకున్నారు. అయితే ఈ విశేషాలు పంచుకుంటున్న క్రమంలో ఆయన ఈ సినిమాలో నాని నేపథ్యం గురించి చెప్పుకొచ్చారు. నిజానికి ఈ సినిమాలో నాని ఒక వేశ్యా వాటికలో ఉంటాడని ముందు నుంచి ప్రచారం జరుగుతూ వస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడు నాని తెగ పేరును పొరపాటున కాసర్ల శ్యామ్ సంబోధించారు. ఈ తెగ 'సవారి తెగ' అని కాసర్ల శ్యామ్ చెప్పుకొచ్చారు. ఈ సాంగ్ చేయడం తనకు చాలా అదృష్టమని, 'దసరా' తర్వాత తనకు ఈ సినిమా కూడా అంత పేరు తెచ్చే సినిమా అవుతుందని ఈ సందర్భంగా ఆయన చెప్పుకొచ్చారు.

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

# చెస్ బోర్డులతో మేధో వికాసం

- మెదడు చురుగ్గా పనిచేయాలంటే చెస్ ఆడాలి!
- జ్ఞాపకశక్తి, సమస్య పరిష్కార నైపుణ్యాలకు చదరంగం కీలకం
- ఎమ్మెల్యే సంజయ్ కుమార్
- 48 ప్రభుత్వ పాఠశాలలకు 200 చెస్ బోర్డుల పంపిణీ



**నేటి సాక్షి, జగిత్యాల టౌన్:** చదరంగం (చెస్) కేవలం ఒక ఆట మాత్రమే కాదని, అది మెదడు పనితీరును మెరుగుపరిచే ఒక గొప్ప సాధనమని జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ ఎం. సంజయ్ కుమార్ అన్నారు. గురువారం జగిత్యాలలోని పాత ఉన్నత పాఠశాలలో గ్రేటర్ అట్లాంటా తెలంగాణ సొసైటీ అధ్యక్షుడు గంద్ర వెంకటరమణారావు సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జగిత్యాల అర్బన్ మండల పరిధిలోని 48 ప్రభుత్వ మరియు జిల్లా పరిషత్ పాఠశాలలకు సుమారు 200 చెస్ బోర్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ, చెస్ ఆడటం వల్ల విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి పెరుగుతుందని, విశ్లేషణాత్మక ఆలోచనలు, సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలు మెరుగుపడతాయని వివరించారు. ఈ ఆట ద్వారా ఓర్పు, సహనం మరియు క్రమశిక్షణ అలవాటు పడతాయని, ఇవి విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయికి దీటుగా మెరుగైన విద్య అందుతోందని, విద్యార్థులు ఇటువంటి క్రీడలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల కోసం చెస్ బోర్డులను అందించ ముందుకు వచ్చిన గ్రేటర్ అట్లాంటా సొసైటీ ఆఫ్ తెలంగాణ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు విద్యార్థుల మేధో వికాసానికి ఎంతో తోడ్పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి చంద్రకళ, చెస్ నెట్‌వర్క్ ఫౌండర్ సుధీర్, వార్డు కౌన్సిలర్ అరవ లక్ష్మి, పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షులు బోయినిపల్లి ఆనందరావు, యాల్ల అమర్నాథ్ రెడ్డి, కమిటీ సభ్యులు సురేష్, సెక్టోరల్ ఆఫీసర్ మహేష్, మాజీ కో-ఆప్షన్ సభ్యులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సైన్స్, ఆధ్యాత్మికతతోనే పరిపూర్ణ వ్యక్తిత్వం





- ఐఐటీ కాన్పూర్ ప్రొఫెసర్ వరుణ్ అగర్వాల్
- నల్లగొండ ఎన్జీ కళాశాలలో అవగాహన
- ఆత్మహత్యలు పరిష్కారం కాదు.. యువత ధైర్యంగా ఉండాలని పిలుపు

**నేటి సాక్షి, నల్లగొండ:** ఆధునిక విజ్ఞాన శాస్త్రం (సైన్స్), ఆధ్యాత్మిక చింతనల కలయిక ద్వారానే మనిషి బలమైన, సమతుల్యమైన వ్యక్తిత్వాన్ని నిర్మించుకోగలడని ఐఐటీ కాన్పూర్ ప్రొఫెసర్ వరుణ్ అగర్వాల్ పేర్కొన్నారు. బుధవారం నల్లగొండ పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సముద్రాల ఉపేందర్ అధ్యక్షతన అకడమిక్ బ్రాంచ్, వేదాంత ఇన్‌స్టిట్యూట్, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వరుణ్ అగర్వాల్ మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా, ఆధ్యాత్మిక విలువలను అలవరచుకున్నప్పుడే సమాజంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోగలరని తెలిపారు. మరో ముఖ్య వక్త, కోల్‌కతా భక్తివేదాంత ఇన్‌స్టిట్యూట్ ప్రెసిడెంట్ కే వాసుదేవరావు మాట్లాడుతూ, నేటి తరం యువత చిన్న చిన్న విషయాలకే భావోద్వేగాలకు లోనై తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోపాన్ని, సంతోషాన్ని సమానంగా స్వీకరిస్తూ భావోద్వేగాలను నియంత్రించుకోవాలని, ఆత్మహత్యలు దేనికీ పరిష్కారం కాదని ఆయన హితవు పలికారు. కళాశాల ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్ మాట్లాడుతూ విద్యార్థుల మానసిక ఉల్లాసానికి ఇటువంటి సదస్సులు ఎంతో దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కో-ఆర్డినేటర్ నాగరాజు, అసోసియేట్ ప్రొఫెసర్ శ్రీనివాసరెడ్డి, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ మునుస్వామి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఎన్. కోటయ్య, వెంకటరెడ్డి, శివరాణి, మల్లేశం, అనిల్ కుమార్, సావిత్రి, పెద్ద సంఖ్యలో బోధన, బోధనేతర సిబ్బందితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉగ్గంపల్లి సర్పంచ్‌కు కేసీఆర్ సన్మానం



**నేటి సాక్షి, మహబూబాబాద్ :** ఉగ్గంపల్లి గ్రామ సర్పంచ్‌గా నూతనంగా ఎన్నికైన అయూబ్ పాషా బుధవారం ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్‌లో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ ఆయనను ఆప్యాయంగా సన్మానించి, ఆశీస్సులు అందజేశారు. డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ కూడా ఈ భేటీలో పాల్గొని అయూబ్ పాషాకు అభినందనలు తెలిపారు. గ్రామ ప్రజల విశ్వాసంతో సర్పంచ్‌గా ఎన్నికైన అయూబ్ పాషా, గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని ఈ సందర్భంగా నేతలు సూచించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పారదర్శకమైన పాలన అందిస్తే గ్రామానికి మంచి పేరు వస్తుందని వారు ఆకాంక్షించారు. తనపై నమ్మకంతో గెలిపించిన గ్రామ ప్రజలకు అయూబ్ పాషా కృతజ్ఞతలు తెలుపుతూ, అందరి సహకారంతో ఉగ్గంపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని, ప్రజా సేవకే అంకితమవుతానని స్పష్టం చేశారు. ఈ కలయిక ఆప్యాయ వాతావరణంలో సాగింది.

# పేపర్ క్రాఫ్ట్‌పై వర్క్‌షాపు



**నేటిసాక్షి, నల్లగొండ :** జాతీయ గ్రీన్ కార్ప్స్ (ఎన్జిసి) సూచనల మేరకు ఎన్‌జి కళాశాలలో ఏకో క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం పేపర్ క్రాఫ్ట్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ మాట్లాడుతూ, ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పర్యావరణంపై బాధ్యతాభావాన్ని పెంచుతాయని పేర్కొన్నారు. ప్రకృతి సంపదలను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, వ్యర్థ పదార్థాలను ఉపయోగకరమైన వస్తువులుగా మార్చే కార్యక్రమంలో విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని సూచించారు. అనంతరం ఏకో క్లబ్ కన్వీనర్ వి. శరీష మాట్లాడుతూ, పేపర్ క్రాఫ్ట్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. పాత వార్తాపత్రికలు, మ్యాగజీన్లు మరియు ఉపయోగించని కాగితాలను ఉపయోగించి, అందమైన అలంకరణ వస్తువులు, పూలు, గోడ అలంకరణలు తయారు చేయవచ్చని తెలిపారు. ఈ విధంగా పేపర్ క్రాఫ్ట్ ద్వారా"రెడ్యూస్ , రీయూజ్, రీసైకిల్ భావనను విద్యార్థులు ఆచరణలో పెట్టవచ్చని చెప్పారు. ఇది విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎన్జిసి ప్రాజెక్ట్ లీడర్ రాజశేఖర్, జిల్లా ఎన్జిసి కో-ఆర్డినేటర్ లక్ష్మీకాంత్ ప్రత్యేక అతిథులుగా పాల్గొని, విద్యార్థులను పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పరంగి రవి, డా. శ్రీనివాసులు, డా. మునుస్వామి, డా. నాగరాజు, డా. శ్రీధర్, ఈకో క్లబ్ సభ్యులు కె. శివరాణి, డా.పి.సిద్ధేశ్ గౌడ్, డా.డి.కృష్ణ, ఇతర అధ్యాపకులు మరియు విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# రేషన్ షాప్‌లో కేవైసీని సద్వినియోగం చేసుకోవాలి

**నేటి సాక్షి, నారాయణపేట (ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలో ని ఇబ్రహీంపట్నంలో బుధవారం కేవైసీ చేసుకోవాలని రేషన్ షాప్‌లో కేవైసీ చేసుకునే విధంగా లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాత కొత్త రేషన్ కార్డ్ దారులు తప్పనిసరిగా కేవైసీ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో, షాప్ డీలర్, డీఎస్ఒ బాలరాజ్, డిటిఎన్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ




**నేటి సాక్షి, మేడిపల్లి:** పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు భయాన్ని వీడి, పట్టుదలతో చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కాంగ్రెస్ మేడిపల్లి మండల ప్రధాన కార్యదర్శి చేపూరి నాగరాజు ఆకాంక్షించారు. ఈ నెల 14వ తేదీ నుండి ప్రారంభం కానున్న పదో తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో, మేడిపల్లి మండలంలోని పోరుమల్ల, కట్లకుంట, వల్లంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఆయన ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్నులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏనుగు రమేష్ రెడ్డి, ఎంఈఓ ఆకుల లక్ష్మినర్సయ్యలతో కలిసి ఆయన ఈ సామాజిక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా చేపూరి నాగరాజు మాట్లాడుతూ, విద్యార్థులు తమ జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకుని తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలని కోరారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా రాసి మంచి మార్కులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు గుయ్య అంజన్న, సట్ట భూమేష్, ఉపసర్పంచులు గడ్డం జలంధర్ రెడ్డి, తుర్తి రమ్య గోపి, మాజీ సర్పంచులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హనుమానసాగర్, కరుణ, ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు అండగా నిలుస్తున్న కాంగ్రెస్ నాయకులను అభినందించారు.

# శంకర్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో 'ఉమెన్ ఫర్ ట్రీ'



**నేటి సాక్షి, శంకర్‌పల్లి:** 99 రోజుల ప్రణాళిక 'ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా బుధవారం శంకర్ పల్లి ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో 'ఉమెన్ ఫర్ ట్రీ' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మెప్మా మహిళా సంఘాల సభ్యులు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని ఆసుపత్రి ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ సాత ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, పచ్చదనం పెంచడంలో మహిళా సంఘాల పాత్ర అభినందనీయమని, ఆసుపత్రి పరిసరాలు ఆహ్లాదకరంగా ఉంటే రోగులకు మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జూలకంటి శ్వేతా పాండురంగారెడ్డి, మున్సిపల్ మేనేజర్ వి. అంజన్ కుమార్, మెప్మా సంఘాల సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపాధి హామీని వినియోగించుకోవాలి



**నేటి సాక్షి, గన్నేరువరం (బుర్ర అంజయ్య గౌడ్) :** మండలంలోని చీమలకుంట గ్రామంలోని ప్రతి కూలికి ఉపాధి హామీ పనులు లభించేలా చర్యలు తీసుకుంటామని చీమలకుంటపల్లి గ్రామ సర్పంచ్ జంగిటి ప్రకాష్ అన్నారు బుధవారం గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు వ్యవసాయ కూలీ పనులు లేక ఇబ్బందులు పడుతున్న కూలీలందరూ అధిక మొత్తంలో ఉపాధి హామీ పనులు పాల్గొని ప్రభుత్వం కొలతల ప్రకారం పని చేసినట్లయితే అధిక మొత్తంలో గిట్టుబాటు కూలి లభిస్తుందని అన్నారు గ్రామంలో కూలీలందరూ వందరోజుల పని దినాలను వినియోగించుకోవాలని అలాగే కూలి ప్రదేశంలో ఎస్ ఎయిడ్ కిట్టు ఏర్పాటు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు

TGTEL/25/A1737 | NETI SAKSHI

# చివరి మజిలీ ప్రశాంతంగా ఉండాలి

- జీవితంలో చేసిన సహాయమే శాశ్వతం
- రోటరీ క్లబ్ అభివృద్ధి పనుల అభినందనీయం
- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్
- శ్రీ సత్య హరిశ్చంద్ర ఘాట్‌లో మొక్కలు నాటిన ఎమ్మెల్యే




**నేటి సాక్షి, జగిత్యాల టౌన్ (పూరెల్ల బాపు):** మనిషి జీవితంలో ఎంత సంపాదించినా, ఎన్ని పదవులు అనుభవించినా చివరికి చేరుకోవాల్సింది స్మశాన వాటికకేనని, అందుకే ఆ చివరి మజిలీ ప్రశాంతంగా ఉండేలా చూడటం మన బాధ్యతని జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ ఎం. సంజయ్ కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని శ్రీ సత్య హరిశ్చంద్ర ఘాట్‌లో రోటరీ క్లబ్ జగిత్యాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన స్టీల్ బెంచీలు, ల్యాండ్ స్కేపింగ్ మరియు పారిశుధ్య కార్యక్రమాలను మున్సిపల్ చైర్‌పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఘాట్ ప్రాంగణంలో ఎమ్మెల్లే, చైర్‌పర్సన్ పలు రకాల పూల మొక్కలు, చెట్లను నాటారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, సొంత లాభం కోసం చేసే పనుల కంటే ఇతరులకు చేసే చిన్న సహాయమే చిరస్థాయిగా గుర్తుండిపోతుందని పేర్కొన్నారు. లక్షలాది రూపాయల ఖర్చుతో స్మశాన వాటికను అభివృద్ధి చేసి, మొక్కలు నాటడం ద్వారా రోటరీ క్లబ్ వారు సమాజానికి ఆదర్శంగా నిలిచారని అభినందించారు. అందరి సహకారంతో ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సమీండ్ల వాణి మాట్లాడుతూ, స్మశాన వాటికలో పచ్చదనాన్ని పెంచడం మంచి ఆలోచనని, ఇది అక్కడికి వచ్చేవారికి మానసిక ప్రశాంతతను ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అరవ లక్ష్మి, మంచల కృష్ణ, సిరిసిల్ల శ్రీనివాస్, రోటరీ క్లబ్ ప్రతినిధులు టి.వి. సూర్యం, చారి, గిరి నాగభూషణం, ఏసీఎస్ రాజు, సమీండ్ల శ్రీనివాస్, బొలసని శ్రీనివాస్, బొడ్ల జగదీష్, రాగుల ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



# 'పది' పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా విద్యాధికారి బొల్లారం బిక్షపతి



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** ఈనెల తేదీ 14 శనివారం నుండి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలను జిల్లా వ్యాప్తంగా పటిష్టంగా నిర్వహించాలని జిల్లా విద్యాధికారి బొల్లారం బిక్షపతి అన్నారు. బుధవారం పట్టణంలోని రైతు వేదికలో మిర్యా లగూడ డివిజన్ లోని పదవ తరగతి పరీక్ష నిర్వహణ కోసం నియామకమైన ఇన్విజిలేటర్లకు పరీక్ష నిర్వహణ సూచనలపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి బొల్లారం భిక్షపతి పాల్గొని, మాట్లాడారు. పది పరీక్షలను ప్రశాంత వాతావరణంలో జరిగేటట్లు మరియు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రంలో సెల్‌ఫోన్‌తో పాటు, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరిక రాలు అనుమతించబడవని, కావున చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్మెంట్ ఆఫీసర్స్, మరియు ఇన్విజిలేటర్స్ పరీక్ష నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా బాధ్యత వహించాలని పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. విద్యార్థులు ఒక పరీక్ష అయిపోయిన తర్వాత, మరో పరీక్ష కోసం పాఠశాలకు వెళ్లి సంసిద్ధులు అయ్యేటట్లు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోని, అత్యుత్తమ ఫలితాల సాధన కొరకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్ అధికారి యూసుఫ్, డిసిఈబి సెక్రటరీ శ్రీనివాస్, మండల విద్యాధికారులు ధీరావత్ ధర్మానాయక్, లక్ష్మణ్, రవి నాయక్, వెంకన్న, వరలక్ష్మి, ఉపాధ్యాయులు కొర్ర కృష్ణ కాంత్ నాయక్, తావుర్యా, తిరుపతి, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, సాజిద్ అలీ, దస్తగిరి, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

- సామాజిక కార్యకర్త కోమల్ల జలందర్
- గొల్లపల్లి మోడల్ స్కూల్‌లో 100 మంది విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్ల పంపిణీ



**నేటి సాక్షి, జగిత్యాల ప్రతినిధి(గుండ ప్రశాంత్ గౌడ్):** పదవ తరగతి వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు కష్టపడి చదివి, ఉన్నతమైన లక్ష్యాలను సాధించాలని సామాజిక కార్యకర్త కోమల్ల జలందర్ పిలుపునిచ్చారు. బుధవారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో చదువుతున్న 100 మంది పదవ తరగతి విద్యార్థులకు ఆయన సొంత ఖర్చులతో ఎగ్జామ్ ప్యాడ్లు మరియు పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోమల్ల జలందర్ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుండే ఒక స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకుని, క్రమశిక్షణతో చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని ఆకాంక్షించారు. రాబోయే పరీక్షల్లో విద్యార్థులందరూ మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని కోరారు. విద్యావంతులైన యువత సమాజ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రవి, జీ స్కిల్స్ యజమాని ముంజంపల్లి రమేష్, వార్డు మెంబర్లు సంగెం కళ్యాణ్ కుమార్, ఐతరవేని మధు, నాయకులు ఐతరవేని వెంకటేష్, కత్తెర్ల హరీష్, ఓర్సు శేషి, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే వస్తువులను పంపిణీ చేసిన జలందర్‌ను పాఠశాల యాజమాన్యం అభినందించింది.

# కాగజ్‌నగర్ హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు

**నేటి సాక్షి, కొమురంభీమ్ ఆసిఫాబాద్ ప్రతినిధి:** కాగజ్‌నగర్ పట్టణంలోని పలు హోటళ్లలో బుధవారం మున్సిపల్ అధికారులు అకస్మాత్తుగా తనిఖీలు నిర్వహించారు. 'ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక' కార్యాచరణలో భాగంగా ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా హోటళ్లలో పరిశుభ్రత, ఆహార పదార్థాల నిల్వ విధానం మరియు వ్యర్థాల నిర్వహణను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. నిబంధనలను ఉల్లంఘించి, పరిశుభ్రత పాటించని కొన్ని హోటళ్లకు జరిమానాలు విధించారు. ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ డీ ప్రణీల్ కుమార్ మాట్లాడుతూ, హోటల్ యజమానులు తప్పనిసరిగా పరిశుభ్రత పాటిస్తూ వినియోగదారులకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఆహారం అందించాలని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం. శంకర్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొని పారిశుద్ధ్య లోపాలను గుర్తించారు.






# తాడ్వాయిలో కంటి వైద్య శిబిరం

**నేటిసాక్షి, ములుగు ప్రతినిధి :** గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాలనే సంకల్పంతో బిఆర్ఎస్ జిల్లా నాయకులు భూక్య జంపన్న ఆధ్వర్యంలో తాడ్వాయి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో స్థానిక సర్పంచ్ గంట ప్రవళిక గున్ను సహకారంతో బుధవారం 26వ విడత ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరానికి తాడ్వాయి మండలంతో పాటు పరిసర మారుమూల గ్రామాల నుండి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కంటి పరీక్షలు చేయించుకోవడం విశేషం. ఈ సందర్భంగా నిపుణులైన వైద్యులు ప్రజలకు కంటి సంబంధిత పలు పరీక్షలు నిర్వహించారు.. కంటి చూపు తగ్గడం, కంటి అలర్జీలు, ముత్యబిందు వంటి సమస్యలను గుర్తించి అవసరమైన వారికి ఆపరేషన్ కొరకు ప్రత్యేక బస్సులో హైదరాబాదులోని శంకర కంటి ఆసుపత్రికి పంపడం విశేషం. ఈ శిబిరం ద్వారా పేద గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఎంతో ఉపయోగం కలిగిందని స్థానికులు తెలిపారు. గ్రామాల్లో నివసించే ప్రజలకు వైద్య సదుపాయాలు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని భూక్య జంపన్న స్వచ్ఛందంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతూ ప్రజలకు తోడుగా నిలుస్తున్నారు. ఇప్పటివరకు ములుగు జిల్లా వ్యాప్తంగా పరిసర ప్రాంతాల్లో వరుసగా 26 విడతలుగా ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహించడం ఆయన సేవా భావానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఈ సందర్భంగా భూక్య జంపన్న మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడమే తన ముఖ్య లక్ష్యమని తెలిపారు. కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలు ఖరీదైన చికిత్సలు చేయించుకోలేని పరిస్థితుల్లో ఉచితంగా పరీక్షలు, మందులు అందించడం ఎంతో అవసరమని అన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు.

# అనుమానాస్పదంగా యువకుడి మృతి



**నేటి సాక్షి, తిమ్మాపూర్:** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని మల్లాపూర్ గ్రామానికి బనక చందు(32) అనే యువకుడు బుధవారం ఉదయం అనుమానాస్పదంగా మృతిచెందాడు. గ్రామస్తులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బనక మల్లయ్య కొడుకు చందు ఉపాధి కోసం నాలుగేళ్లుగా దుబాయ్ వెళ్తూ, వస్తున్నాడు. ఇటీవల గ్రామానికి వచ్చిన చందు బుధవారం ఉదయం తనకు వ్యక్తిగత పనిఉందని చెప్పి7గంటల ప్రాంతంలో ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. దాదాపు 10గంటల సమయంలో పక్కనే ఉన్న మన్నెంపల్లి గ్రామ శివారులోని కెనాల్లో అనుమానాస్పదంగా చనిపోయి కనిపించాడు. చందు మృతదేహాన్ని చూసిన స్థానికులు వెంటనే అతడి తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. విషయం తెలుసుకున్న తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్ ఘటనాస్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ దవాఖానకు తరలించారు. తమ కొడుకు అనుమానాస్పదంగా మృతిచెందాడనే కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎల్ఎండీ ఎస్ఐ అన్వర్ తెలిపారు.

# శుభ్రమైన తాగునీటిని అందించాలి



**నేటి సాక్షి, నారాయణపేట (ఇమామ్ సాబ్):** ప్రజలకు శుభ్రమైన తాగునీరు అందించాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అబ్దుల్ ఖలీల్ అన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా బుధవారం మరికల్ మండల కేంద్రంలో నీటి ట్యాంకును శుభ్రం చేయించారు. అలాగే పరిసరాలను పరిశుభ్రం చేయడం జరిగిందని అబ్దుల్ ఖలీల్ అన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ గుప చెన్నయ్ ఇతర మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ రైతుగా గొడుగు స్వామి




**నేటి సాక్షి, గన్నేరువరం (బుర్ర అంజయ్య గౌడ్) :** మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన గొడుగు స్వామి యాదవ్ ఇఫ్కో నాను యూరియా ఆదర్శ రైతు పురస్కారం బుధవారం కరీంనగర్ జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి చేతుల మీదుగా అందుకున్నారు. తనకున్న వ్యవసాయ భూమిలో, కౌలు తీసుకున్న భూమిలో నానవూరియాను వరి, మొక్కజొన్న పంటలపై పిచికారి చేసి ఉత్తమ ఫలితాలు సాధించినందుకు ఇఫ్కో నానో కంపెనీ ఈ అవార్డు అందజేశారని మండల వ్యవసాయ అధికారి కిరణ్ మై తెలిపారు

TGTEL/25/A1737 | NETI SAKSHI

# పదో తరగతే జీవితానికి తొలిమెట్టు

- ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ జనార్ధన్
- పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు



**నేటి సాక్షి, కొమురంభీం ఆసిఫాబాద్ ప్రతినిధి :** విద్య ద్వారానే సమాజంలో గొప్ప మార్పు, అభివృద్ధి సాధ్యమని కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కే జనార్ధన్ అన్నారు. జిల్లాలోని ఆరెగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పర్ష చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవం, పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు (ఫేర్వెల్) వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడుతూ, పదో తరగతి అనేది విద్యార్థి జీవితంలో అత్యంత కీలకమైన దశ అని, ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ భీమన్‌కర్ పద్మ వసంతరావు మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణను అలవర్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ మాట్లాడుతూ, విద్యార్థులందరూ పరీక్షల్లో విజయం సాధించి పాఠశాలకు మరియు తమ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, పదో తరగతి తర్వాత ఉన్నత చదువుల్లోనూ రాణించి సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థుల కేరింతలు, నృత్యాలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రోహిణి రామయ్య, ఉపాధ్యాయులు బి. అనిత, సుగుణ, లాలాజీ, మహేష్, సత్యనారాయణ, ఆయేషా సిద్దికా, పీడీ పరమశివ, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కౌటలలో బీఆర్ఎస్‌కు భారీ షాక్

- కాంగ్రెస్‌లో చేరిన ముఖ్య నేతలు
- పదవులు శాశ్వతం కాదు.. చేసిన పనులే గుర్తుంటాయి: డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ
- కౌటల మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా నీకోడే గంగారం ఏకగ్రీవం



**నేటి సాక్షి, కొమురంభీం ఆసిఫాబాద్ ప్రతినిధి:** కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కౌటల మండలంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ నుంచి భారీగా చేరికలు సాగాయి. ఆదిలాబాద్ డీసీఎంఎస్ మాజీ వైస్ చైర్మన్ మంతయ్యతో పాటు పలువురు సర్పంచులు, ఉప సర్పంచులు, మాజీ సర్పంచులు బీఆర్ఎస్ వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, ఎమ్మెల్సీ దండే విఠల్ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కౌటల, చింతలమానేపల్లి మండలాల అధ్యక్ష పదవుల కోసం దరఖాస్తులను స్వీకరించిన అనంతరం, కౌటల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నీకోడే గంగారం పేరును ఏకగ్రీవంగా ఖరారు చేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ.. సిర్పూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నిండు కుండలా మారిందని, ప్రజలంతా ప్రజా ప్రభుత్వం వైపు చూస్తున్నారని పేర్కొన్నారు. పదవులు ఎవరికీ శాశ్వతం కాదని, పదవిలో ఉన్నప్పుడు మనం చేసిన అభివృద్ధి పనులే చిరస్థాయిగా నిలిచిపోతాయని ఆమె హితవు పలికారు. ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి, ప్రజలకు లబ్ధి చేకూరేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పార్టీ నియమావళికి కట్టుబడి ఉండాలని, పార్టీకి ద్రోహం చేయడం అంటే కన్నతల్లికి ద్రోహం చేసినట్లేనని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సిర్పూర్ ప్రాంత అభివృద్ధికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కౌటల, చింతలమానేపల్లి మండలాల తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# నానో యూరియాతో సాగు ఖర్చు తగ్గింపు




**నేటి సాక్షి, చిలుకూరు:** ఆధునిక వ్యవసాయ పద్ధతులను అలవర్చుకోవడం ద్వారా రైతులు సాగు ఖర్చును తగ్గించుకోవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆత్మ సౌజన్యంతో, గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో 'నానో యూరియా - నానో డీఏపీ' వాడకంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నానో ఎరువుల వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు క్షుణ్ణంగా వివరించారు. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్ మాట్లాడుతూ, నానో యూరియాను ఆకులపై పిచికారీ చేయడం వల్ల మొక్కలకు పోషకాలు నేరుగా అందుతాయని తెలిపారు. దీనివల్ల సాంప్రదాయ రసాయన ఎరువుల వాడకాన్ని 50 శాతం వరకు తగ్గించవచ్చని, తద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా 500 ఎంఎల్ నానో యూరియా బాటిల్.. ఒక బస్తా (45 కిలోల) సాధారణ యూరియాతో సమానంగా పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. సాగులో నేల ప్రాముఖ్యత, నేల ఆరోగ్య పరిరక్షణ, సేంద్రియ సాగు విధానాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించారు. రైతులు ఆర్థికంగా ఎదగాలంటే ఆధునిక వ్యవసాయ సాంకేతికతలను అందిపుచ్చుకోవాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మా చైర్మన్ బుడిగం లింగయ్య, మండల వ్యవసాయ అధికారి జెడ్. శ్రీధర్, ఏఈఓలు చంద్రశేఖర్, వసీమ, శిరీష, శాస్త్రవేత్త ఆదర్శ్ మరియు రైతులు కస్తూరి సైదులు, సైదిరెడ్డి, సుల్తాని వెంకటేశ్వర్లు, గుండు మహేష్, బుడిగి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# జీవితం ఒక్కటే.. బాధ్యతగా జీవించండి

**సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ**






**నేటి సాక్షి, మునగాల (పాముల రాఘవేందర్):** జీవితం ఎంతో విలువైనదని, దానిని అర్థవంతంగా, బాధ్యతాయుతంగా జీవించాలని యువతకు సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ పిలుపునిచ్చారు. 'ప్రజాపాలన -- ప్రగతి నివేదిక' కార్యక్రమంలో భాగంగా బుధవారం మునగాల మండలం ఆకుపాముల గ్రామంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజలతో నేరుగా ముచ్చటించి, శాంతిభద్రతల పరిరక్షణ, సామాజిక బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువత అతివేగంగా వాహనాలు నడపడం వల్ల తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలో పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ ధరించడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. అలాగే, పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే ఫోన్ కాల్స్, అనుమానాస్పద లింక్‌ల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. యువత మత్తు పదార్థాల బారిన పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ఎస్పీ కోరారు. సమాజంలో శాంతిభద్రతలు కాపాడటంలో ప్రజల సహకారం ఎంతో కీలకమని, ఏదైనా అనుమానాస్పద ఘటనలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రథమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, యువత మరియు ఆకుపాముల గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# 'అంజన్న ఆశీర్వాద యాత్ర'ను విజయవంతం చేయండి

**నేటి సాక్షి, గన్నేరువరం( బుర్ర అంజయ్య గౌడ్):** కరీంనగర్ మహాశక్తి ఆలయం నుంచి ప్రారంభం కాబోతున్న 'అంజన్న ఆశీర్వాద పాదయాత్ర'ను జయప్రదం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర రెడ్డి పిలుపునిచ్చారు. గన్నేరువరం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ అధ్యక్షతన నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాత్రకు సంబంధించిన రూట్ మ్యాప్, ఏర్పాట్లపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. మార్చి 14వ తేదీ శనివారం ఉదయం 6 గంటలకు కరీంనగర్‌లోని మహాశక్తి దేవాలయం నుండి కొండగట్టు వరకు ఈ పాదయాత్ర సాగుతుందని నాగేశ్వర రెడ్డి తెలిపారు. సుమారు 10 వేల మంది కార్యకర్తలతో నిర్వహించే ఈ ఆధ్యాత్మిక యాత్రలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్వయంగా పాల్గొంటారని వెల్లడించారు. గన్నేరువరం మండలంలోని ప్రతి గ్రామం నుండి ప్రజలు, కార్యకర్తలు మరియు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి యాత్రను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏలేటి చంద్రారెడ్డి, బొమ్మాడి సురేందర్ రెడ్డి, పుల్లల రాములు, మచ్చ సాయికృష్ణ, పుల్లల జగన్మోహన్, దానవేని ప్రశాంత్, ఏలేటి శేఖర్ రెడ్డి, పుర్ర హరీష్, బోయిన వేణు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి




**నేటి సాక్షి, చిలుకూరు:** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం రామాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం ఎన్జీ శివకుమారి మాట్లాడుతూ విద్యార్థులు గొప్ప కలలు కనాలని, వాటిని సాధించేందుకు కష్టపడి చదవాలని ఆమె పిలుపునిచ్చారు. ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే భవిష్యత్తులో అద్భుతమైన విజయాలు లభిస్తాయని ఆమె ఆకాంక్షించారు. సర్పంచ్ వేమూరు సతీష్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, నిజాయితీ, నైతిక విలువలను అలవర్చుకోవాలని సూచించారు. రాబోయే వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ రాయబారపు వెంకటరమణ, ఉపాధ్యాయులు టీవైఎల్ఎన్ స్వామి, ఇంజమూరి రామంజలిదేవి, చందా రాములు, సొంటి అరుంధతి, దేవరం వెంకట్ రెడ్డి, నందిగామ పరిమళమ్మ, కుక్కునూరి వెంకన్న, కదిర బ్రహ్మారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

# సైదమ్మకు జర్నలిస్టుల నివాళి



**నేటి సాక్షి, చిలుకూరు:** చిలుకూరు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మల్లం వెంకటేశ్వర్లు మాతృమూర్తి సైదమ్మ (75) బుధవారం హఠాన్మరణం చెందారు. సాయంత్రం జర్నలిస్టులు ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ప్రగాఢ శ్రద్ధాంజలి ఘటించారు. మల్లం వెంకటేశ్వర్లును, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. చిలుకూరు ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షుడు కస్తూరి రాములు, సీనియర్ జర్నలిస్ట్ ఏనుగుల వీరాంజనేయులు, స్థానిక జర్నలిస్టులు కొడారు బ్రహ్మం, అనంతరపు గోవిందా చారి, మొక్క వెంకన్న తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. సైదమ్మ అంత్యక్రియలు గురువారం ఉదయం చిలుకూరు గ్రామ శివారులో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# నేడు జాతీయస్థాయి పాటల పోటీలు

**నేటిసాక్షి, మిర్యాలగూడ :** స్థానిక సాంస్కృతిక కళాకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి నాటక పోటీల్లో భాగంగా, గురువారం జాతీయ స్థాయి పాటల పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. తెలంగాణ నాటక సమాజాల అధ్యక్షులు తడకమళ్ల రామచంద్రయ్య, అధ్యక్షులు రామావతారం లక్ష్మీనారాయణ, శర్మ, పులి కృష్ణమూర్తి బుధవారం ఈ పోటీలకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ పోటీలకు శైలజ, ప్రతాప్, కందుకూరి సుదర్శన్, సత్యనారాయణ కన్వీనర్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, ప్రతిభ కలిగిన గాయనీ గాయకులను ప్రోత్సహించేందుకు ఈ పోటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోటీల్లో ప్రథమ విజేతకు రూ. 5,000, ద్వితీయ విజేతకు రూ. 4,000 మరియు తృతీయ విజేతకు రూ. 3,000 నగదు బహుమతులతో పాటు కన్సోలేషన్ సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేయనున్నట్లు ప్రకటించారు. జాతీయ స్థాయి వేదికపై తమ ప్రతిభను చాటుకునేందుకు కళాకారులకు ఇది ఒక మంచి అవకాశమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యావంతుల వేదిక ప్రతినిధి అంబటి నాగయ్య, కళాకారులు ఎల్లయ్య, సరస్వతి, శ్రీనివాస్, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.





# ఘనంగా మహిళా దినోత్సవం

**నేటి సాక్షి, వికారాబాద్:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం వికారాబాద్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మహిళలతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళా శక్తిని చాటేలా మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో కోలాహలం నెలకొంది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ అనన్య మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు. తోటి మహిళలందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ భవిష్యత్తులో మహిళా సాధికారత కోసం మున్సిపాలిటీ తరఫున మరిన్ని ఉత్సాహభరితమైన కార్యక్రమాలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. వేడుకల్లో భాగంగా మహిళలకు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు చైర్‌పర్సన్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అర్ధ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి, స్థానిక కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, పట్టణ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేడు సర్పంచులు, కౌన్సిలర్లకు శిక్షణ



**నేటి సాక్షి, వికారాబాద్ :** ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా నేడు(గురువారం) గౌళి కార్ ఫంక్షన్ హాలులో సర్పంచులు, మున్సిపల్ వార్డు సభ్యులు, చైర్మన్లకు శిక్షణా కార్యక్రమానికి నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ దీపక్ తివారి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు.

# నేడు 'డయల్ యువర్ ఎస్పీ'



**నేటి సాక్షి, నారాయణపేట (ఇమామ్ సాబ్):** జిల్లాలోని ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ గురువారం 'డయల్ యువర్ ఎస్పీ' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మార్చి 12వ తేదీన ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని ఎస్పీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఒక గంట వ్యవధిలో ప్రజలు మరియు ఫిర్యాదుదారులు జిల్లా ఎస్పీ కార్యాలయానికి చెందిన 0850 6281182 నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లవచ్చు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్పీ స్వయంగా ప్రజలతో మాట్లాడి వారి ఫిర్యాదులు, సూచనలు, అభ్యంతరాలను స్వీకరిస్తారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రజలు, ముఖ్యంగా పోలీసు స్టేషన్ల వరకు రాలేని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కోరారు. నేరుగా జిల్లా అత్యున్నత పోలీస్ అధికారితో మాట్లాడే అవకాశం ఉన్నందున, ప్రజలు ధైర్యంగా తమ సమస్యలను విన్నవించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

# పాములపాడు కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



**నేటి సాక్షి, పాములపాడు:** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం (కేజీబీవీ)లో 2026-27 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైందని పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతితో పాటు ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో చేరుటకు ఆసక్తి గల విద్యార్థినుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ నెల 12వ తేదీ నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు వివరించారు. విద్యార్థులు నిర్ణీత గడువులోగా అధికారిక వెబ్‌సైట్ https://apkgbv.apcfss.in లో దరఖాస్తు చేసుకోవాలని, అనంతరం ఆన్‌లైన్ దరఖాస్తు జిరాక్స్ ప్రతులను పాములపాడులోని కేజీబీవీ విద్యాలయంలో అందజేయాలని సూచించారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ ఎంపీసీ విభాగంలో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయని రాజ్యలక్ష్మి తెలిపారు. ముఖ్యంగా మధ్యలో బడి మానేసిన వారు, అనాథ పిల్లలు, తల్లి లేదా తండ్రి లేని విద్యార్థినులకు నిబంధనల ప్రకారం ప్రవేశాల్లో మొదటి ప్రాధాన్యత కల్పిస్తామని స్పష్టం చేశారు. మండల పరిధిలోని అర్హులైన విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# ఇండ్లు, భవన నిర్మాణాల పరిశీలన

**నేటిసాక్షి, మిర్యాలగూడ :** మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను, గ్రామ పంచాయతీ కార్యాలయంను బుధవారం శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పరిశీలించారు. అనంతరం రుద్రారం గ్రామంలో నూతన నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# డిజిటల్ చెల్లింపులపై అవగాహన ఉండాలి

## వికారాబాద్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ విజయ్ సునీల్




**నేటి సాక్షి, వికారాబాద్:** డిజిటల్ ఆర్థిక లావాదేవీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి, సైబర్ మోసాలకు గురికాకుండా జాగ్రత్త వహించాలని వికారాబాద్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ విజయ్ సునీల్ సూచించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్చి 9 నుండి 15 వరకు నిర్వహిస్తున్న 'డిజిటల్ చెల్లింపుల అవగాహన వారోత్సవం-2026'లో భాగంగా, వికారాబాద్ మండల పరిధిలోని సిద్ధలూరు గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ ఏడాది డిజిటల్ చెల్లింపుల వారోత్సవాలు 'సురక్షిత డిజిటల్ చెల్లింపులు' అనే ఇతివృత్తంతో నిర్వహించబడుతున్నాయని, 'తోడా ధ్యాన్ సే' అంటే కొంచెం జాగ్రత్తగా ఉండండి అనే నినాదంతో ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని విజయ్ సునీల్ తెలిపారు. ఈ సందర్భంగా ఖాతాదారులు పాటించాల్సిన కీలక నియమాలను ఆయన వివరించారు. ముఖ్యంగా డబ్బులు అందుకునేందుకు ఎప్పుడూ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాల్సిన లేదా పిన్ ఎంటర్ చేయాల్సిన అవసరం ఉండదని గమనించాలని కోరారు. అలాగే మీ ఓటీపీ, పిన్ లేదా పాస్‌వర్డ్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరితోనూ పంచుకోకూడదని స్పష్టం చేశారు. పెట్టుబడి యాప్‌లు, కేవైసీ అప్‌డేట్, లాటరీ పేరుతో వచ్చే అనుమానాస్పద లింక్‌లు, నమ్మశక్యం కాని ఆఫర్ల పట్ల మోసపోవద్దని హెచ్చరించారు. ఏదైనా నగదు పంపే ముందు లబ్ధిదారుడి పేరు, పంపుతున్న మొత్తాన్ని రెండుసార్లు సరిచూసుకోవడం ద్వారా పొరపాట్లను నివారించవచ్చని పేర్కొన్నారు. డిజిటల్ చెల్లింపులు చేసేటప్పుడు కొంచెం జాగ్రత్త వహిస్తే మోసాల నుండి మన సంపాదనను కాపాడుకోవచ్చని ఆయన నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ శంకర్, వివోఏ జంగయ్య, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు, పెద్ద సంఖ్యలో ఖాతాదారులు పాల్గొన్నారు.

# పెంచిన గ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలి

## సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దినకర్



**నేటి సాక్షి, కొమురంభీం ఆసిఫాబాద్:** కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరలను పెంచడాన్ని నిరసిస్తూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్ వద్ద ఖాళీ గ్యాస్ బండతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్ మాట్లాడుతూ, గృహ వినియోగ గ్యాస్‌పై రూ. 60, కమర్షియల్ గ్యాస్‌పై రూ. 115 పెంపు సామాన్య ప్రజలపై తీవ్ర భారం మోపుతున్నదని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనాలోచిత విదేశాంగ విధానాల వల్లే ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయని విమర్శించారు. యుద్ధ పరిస్థితుల్లో భారత ప్రభుత్వం ఇజ్రాయెల్, అమెరికాలకు మద్దతు ఇవ్వడం వల్ల ఇరాన్ మన దేశానికి వచ్చే చమురు ట్యాంకర్లను సముద్రంలో నిలిపివేసిందని పేర్కొన్నారు. ఇరాన్ ఎప్పటి నుంచో మన మిత్రదేశమని గుర్తు చేశారు. అమెరికా మెప్పుకోసం మోడీ ప్రభుత్వం మిత్రదేశాలతో సంబంధాలు దెబ్బతీస్తోందని అన్నారు. రష్యా నుండి రోజుకు 20 లక్షల బ్యారెళ్ల చమురు దిగుమతి చేసుకునే ఒప్పందాన్ని అమెరికా ఒత్తిడితో 10 లక్షల బ్యారెళ్లకు తగ్గించుకున్నారని విమర్శించారు. అమెరికా చెప్పినట్లే దిగుమతులు చేయడం, వద్దంటే ఆపేయడం వంటి విధానం చూస్తుంటే దేశ సార్వభౌమత్వం ప్రమాదంలో పడుతున్నదని అన్నారు. మోడీ ప్రభుత్వం వెంటనే అలీన విదేశాంగ విధానానికి అనుగుణంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. సామాన్యులు, మధ్యతరగతి ప్రజలపై భారమయ్యే విధానాలను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు గుడిసెల కార్తీక్, టికానంద్, నాయకులు నిఖిల్, రాజ్‌కుమార్, పవన్తో పాటు మహిళలు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు కొప్పుల పరామర్శ

## ప్రజల బాధలో బంధువై ఉంటానని భరోసా



**నేటి సాక్షి, ఎండపల్లి:** మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ బుధవారం మండలంలో పర్యటించి పలు కారణాలతో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను కలిసి వారి దుఃఖంలో భాగస్వామ్యమై మనోధైర్యం అందించారు. ముందుగా పాతగూడూర్ గ్రామానికి వెళ్లిన ఆయన, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు సుంకిశాల హనుమంతరావు సతీమణి వసంత మృతి చెందిన నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం చర్లపల్లి గ్రామానికి చెందిన మాదాసు తిరుపతి (రేషన్ డీలర్) కుమారుడు అక్షయ్ కుమార్ అనారోగ్యంతో అకాల మరణం పట్ల విచారం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు ఓదార్పు అందించారు. భవిష్యత్తు కల్గిన అక్షయ్ అకాల మరణం బాధాకరం అని, చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజల బాధలో బంధువై ఉంటానని కొప్పుల భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సింహాచలం జగన్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఏలేటి కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ గాజుల మల్లేశం, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పడిదం నారాయణ, ఉద్యమకారుడు పడిదం వెంకటేష్, ఉప సర్పంచ్ మెరుగు జానీ, సీనియర్ నాయకులు బట్టు రామస్వామి, గ్రామ శాఖల అధ్యక్షులు ఉప్పు రాజయ్య, శేరే శ్రావణ్, యువనేత ఆరెల్లి బాబా రాజ్, భారత రాజ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చదువును మించిన ఆస్తి లేదు: మంత్రి అడ్లూరి


## గుల్లకోట పాఠశాలలో కిచెన్ షెడ్లు ప్రారంభం



**నేటి సాక్షి, ఎండపల్లి:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి కృషి చేయాలని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన కిచెన్ షెడ్స్‌ను మంత్రి బుధవారం ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన మంత్రికి పాఠశాల విద్యార్థులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో చదువును మించిన ఆస్తి లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న అనేక మంది నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యా రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఉత్తమ అవకాశాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపించి వారికి నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత ఉందని మంత్రి అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు కావడానికి కిచెన్ షెడ్స్ నిర్మాణం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అదేవిధంగా గుల్లకోట గ్రామంలో రహదారులు, పారిశుద్ధ్యం, తాగునీరు వంటి ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూడా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దొండ కృపాకర్, స్థానిక సర్పంచ్ గొల్లపెల్లి మల్లేశం గౌడ్, ఏఎంసీ చైర్మన్ గుండాటి గోపిక, కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి మండల అధ్యక్షులు తాటిపర్తి శైలేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి, రాంరెడ్డి, మహిపాల్ రెడ్డి, నాయకులు బిసగోని సత్యం, అరిగేల రవి, యువ నాయకులు గోనే సురేష్, సంతోష్, లక్ష్మణ్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, కార్యదర్శి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విలేకరిపై కాంగ్రెస్ నాయకుల దాడి హేయమైన చర్య

- నాణ్యత లోపాలను ప్రశ్నించినందుకే చంద్రశేఖర్‌పై దాడి
- తప్పుడు కేసును రద్దు చేయకపోతే సీపీకి ఫిర్యాదు చేస్తాం
- బీఆర్ఎస్ నాయకులు హెచ్చరిక




**నేటి సాక్షి, మంచిర్యాల:** కన్నెపల్లి మండల కేంద్రంలో విలేకరిపై జరిగిన దాడిని బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన పత్రికా రంగంపై దాడులు చేయడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. ఎన్కే-24 రిపోర్టర్ చెండే చంద్రశేఖర్ స్థానిక కేజీబీవీ పాఠశాలలో జరుగుతున్న ప్రహరీ గోడ నిర్మాణ పనుల్లో నాణ్యత లోపాలను ఎత్తిచూపుతూ వార్త ప్రచురించినందుకు, కాంగ్రెస్ నాయకులు కక్ష గట్టి ఆయనపై దాడికి తెగబడ్డారని ఆరోపించారు. ఈ సందర్భంగా మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఆకుతోట రాజన్న, సర్పంచ్ గువ్వల రవి మాట్లాడుతూ, దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు, అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి తలొగ్గి బాధితుడైన విలేకరిపైనే తప్పుడు కేసు నమోదు చేయడం దురదృష్టకరమని అన్నారు. విలేకరులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తు చేశారు. చంద్రశేఖర్‌పై నమోదైన తప్పుడు కేసును వెంటనే రద్దు చేయాలని, దాడికి పాల్పడిన కాంగ్రెస్ నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. న్యాయం జరగని పక్షంలో ఈ విషయాన్ని పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువజన అధ్యక్షుడు జిల్లెల్ల మహేష్ గౌడ్, నాయకులు బండ గణేష్, ఎన్న రవి, చి. రాములు, తలండి అశోక్, బెద్దల శ్రీనివాస్, వడుగురి బాపు, బెలాజీ, ఎ. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాలకు కారణం కాకుండా

# కాస్త చూడండి సార్!

- ఫ్లైఓవర్ వద్ద వంగిపోయిన స్టాండ్‌తో వాహనదారుల అవస్థలు
- నిత్యం జరుగుతున్న ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు
- పెద్ద ప్రమాదం జరుగకముందే మరమ్మతులు చేయాలని ప్రజల డిమాండ్



నేటి సాక్షి, కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ పట్టణంలోని మెయిన్ మార్కెట్ ఫ్లైఓవర్ సమీపంలో ఉన్న నాలీపై ఏర్పాటు చేసిన ఇనుప స్టాండ్లు వాహనదారులకు మృత్యుపాశాలుగా మారుతున్నాయి. ఫ్లైఓవర్ పక్కన ఉన్న నాలీపై భద్రత కోసం ఏర్పాటు చేసిన ఇనుప స్టాండ్ ఒకవైపు పూర్తిగా వంగిపోవడంతో ఆ దారి గుండా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ వంగిపోయిన ఇనుప కడ్డీల కారణంగా రహదారిపై ప్రయాణించడం ప్రమాదకరంగా మారిందని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానిక వ్యాపారులు, పాదచారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ ఈ ప్రాంతంలో ఒకటి రెండు ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ, సంబంధిత మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో వెలుతురు సరిగా లేకపోవడంతో, వంగిపోయిన ఇనుప స్టాండ్‌ను గమనించని ద్విచక్ర వాహనదారులు దానిని ఢీకొని కిందపడి గాయపడుతున్నారు. ఈ సమస్యను ఇప్పటికే పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి స్పందన లేదని స్థానికులు వాపోతున్నారు. ఏదైనా పెద్ద ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించకముందే, అధికారులు తక్షణమే స్పందించి ఫ్లైఓవర్ పక్కన ఉన్న నాలీలకు మరమ్మతులు చేపట్టి, ఇనుప స్టాండ్‌ను సరిచేయాలని పట్టణ ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

## స్నేహబంధం చాటిన

# బాల్య మిత్రులు

### ఆపద సమయంలో ఆర్థిక భరోసా



**నేటి సాక్షి, ఎండపల్లి:** మండల పరిధి సూరారం గ్రామానికి చెందిన కొక్కుల రాజేశం గుండె సంబంధిత వ్యాధితో కొంతకాలంగా తీవ్రంగా బాధపడుతున్నాడు. పలుమార్లు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ రావడంతో కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. వైద్య చికిత్స ఖర్చులు అధికంగా ఉండటంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్న సమయంలో అతని బాల్య మిత్రులు మానవత్వం చాటుకున్నారు. రాజేశం పరిస్థితి గురించి తెలిసిన 2004--05 సంవత్సరానికి చెందిన అతని పూర్వ స్నేహితులు కలిసి అండగా నిలవాలని నిర్ణయించారు. కాగా మిత్రులంతా కలిసి సేకరించిన రూ.25,000 నగదును రాజేశంకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు అతని ఆరోగ్య పరిస్థితి ఆరా తీసి త్వరగా కోలుకుని మళ్లీ సాధారణ జీవితాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. సంక్షోభ సమయంలో స్నేహితులు ముందుకు వచ్చి సహాయం చేయడం అభినందనీయమని గ్రామస్తులు తెలిపారు. నిజమైన స్నేహం కష్టసమయంలోనే తెలుస్తుందని, మిత్రులు చూపిన ఈ సహృదయం ఇతరులకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని గ్రామ పెద్దలు పేర్కొన్నారు.



# మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూసా అలీఖాన్‌కు ఘన సన్మానం

**నేటి సాక్షి, మిర్యాలగూడ:** అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో డా. మూసా అలీఖాన్‌కు ఘన సన్మానం జరిగింది. హైదరాబాద్‌లో డా. చక్రవర్తి నేతృత్వంలో మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో డా. మూసా అలీఖాన్ ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. మహిళా సాధికారతకు కృషి చేస్తున్న పలువురు ప్రముఖులకు ఈ వేదికపై ప్రత్యేక గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా డా. మూసా అలీఖాన్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉండటం హర్షణీయమని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యా, వైద్య, రాజకీయ రంగాల్లో మహిళలు మరింత క్రియాశీలక పాత్ర పోషించాలని ఆయన ఆకాంక్షించారు. మహిళలను గౌరవించడం మన భారతీయ సంప్రదాయంలో అంతర్భాగమని, అటువంటి విలువలను కాపాడుకోవడం మనందరి బాధ్యతని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంతోమంది మహిళా మూర్తులకు అవార్డులు అందజేయడం తనకు ఎంతో సంతోషాన్ని, గర్వాన్ని కలిగించిందని ఆయన తెలిపారు. వేడుకల్లో భాగంగా మనం ఫౌండేషన్ ప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పట్టణ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలి

**కట్ట మైసమ్మ ఆలయం చుట్టూ స్టీల్ రైలింగ్ పనులు ప్రారంభం**

**70 వేల రూపాయల విరాళం అందించిన బాకం ఓం ప్రకాష్ దంపతులు**

**మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య చేతుల మీదుగా పనులు శ్రీకారం**



**నేటి సాక్షి, పెద్దపల్లి):**

పెద్దపల్లి పట్టణంలోని మినీ ట్యాంక్ బండ్ చివరన ఉన్న కట్ట మైసమ్మ ఆలయం చుట్టూ స్టీల్ రైలింగ్ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. పట్టణానికి చెందిన బాకం ఓం ప్రకాష్.. సుమలత దంపతులు సుమారు 70 వేల రూపాయల వ్యయంతో ఈ పనులను చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మల్లయ్య మాట్లాడుతూ కట్ట మైసమ్మ తల్లి ఆశీస్సులు బాకం ఓం ప్రకాష్.. సుమలత దంపతులకు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఆలయం చుట్టూ స్టీల్ రైలింగ్ ఏర్పాటు చేయడం శుభపరిణామమని పేర్కొన్నారు. పట్టణ ప్రజలందరూ సుఖ సంతోషాలతో.. ఆనందంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు దొడ్డుపల్లి జగదీష్.. మంతెన నర్సింగ్.. కమల్.. నల్లల సురేష్ పాల్గొన్నారు. వీరితో పాటు మాజీ కౌన్సిలర్ భూతగడ్డ సంపత్.. బొడ్డుపల్లి రామ్మూర్తి.. బాకం వర్షిని.. ఆలయ కమిటీ నిర్వాహకులు బొడ్డుపల్లి శ్రీనివాస్.. గందు రంగయ్య.. బొడ్డుపల్లి నవీన్.. బొడ్డుపల్లి అశోక్.. ముక్కెర రాజేశం.. బొడ్డుపల్లి సంపత్.. మోహన్.. ఎలా పోతారం మొగిలి.. మంద భాస్కర్ యాదవ్.. తిర్రి శ్రీనివాస్ గౌడ్.. తిరుపతి యాదవ్.. రాచమల్ల సతీష్.. అంజయ్య.. నరసయ్య.. గుడి కందుల మల్లయ్య పాల్గొన్నారు.

# రాజకీయాలకతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేస్తా

**పైతరను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా: రవితేజ రెడ్డి**

**మహిళా సమైక్య భవనం.. ఇతర పనులకు ప్రాధాన్యత**

**తాగునీరు.. పారిశుద్ధ్య సమస్యలు లేకుండా కృషి**

**నేటి సాక్షి, కొల్చారం:**



రాజకీయాలకు అతీతంగా పైతర గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రవితేజ రెడ్డి తెలిపారు. గ్రామంలో మహిళా సమైక్య భవనంతో పాటు వివిధ అభివృద్ధి పనులను ప్రజల భాగస్వామ్యంతో పూర్తి చేసి.. గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా.. వారి కష్టసుఖాల్లో తోడుంటూ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో ప్రధానంగా తాగునీరు.. వీధి దీపాలు.. పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు రవితేజ రెడ్డి వివరించారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని వెల్లడించారు. అభివృద్ధి పనుల్లో రాజకీయాలకు తావులేకుండా.. అందరినీ కలుపుకుని గ్రామాన్ని ప్రగతి పథంలో నడిపిస్తానని స్పష్టం చేశారు.

# చిన్నారులే మాస్టార్లు..

**రాంపూర్ యూపీఎస్ లో స్వయంపాలన దినోత్సవం**

**విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి విద్యాబోధన**

**తల్లిదండ్రుల కలలను నిజం చేయాలి: హెచ్ ఎం రవీందర్ రెడ్డి**

**నాయకత్వ లక్షణాలను పెంపొందించిన వేడుక**



**నేటి సాక్షి, కొల్చారం:**

కొల్చారం మండలం రాంపూర్ యూపీఎస్ పాఠశాలలో బుధవారం స్వయంపాలన దినోత్సవం ఘనంగా జరిగింది. ఒకటో తరగతి నుండి ఐదో తరగతి వరకు ఉన్న విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒక్కో విద్యార్థి ఒక్కో సబ్జెక్టుకు ఉపాధ్యాయునిగా మారి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ఉపాధ్యాయుల వేషధారణలో వచ్చిన చిన్నారులు క్రమశిక్షణతో పాఠాలు బోధించడంతో పాఠశాల ప్రాంగణమంతా సందడిగా మారింది.

### కలలను నిజం చేయాలి

ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. "తల్లిదండ్రులు కన్న కలలను నిజం చేసేందుకు ప్రతి విద్యార్థి చదువుపై మక్కువ చూపాలి. క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలి" అని సూచించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను.. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో తోడ్పడతాయని పేర్కొన్నారు. చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాఠాలు చెప్పడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవీందర్ రెడ్డి.. ఉపాధ్యాయ బృందం.. గ్రామస్తులు పాల్గొన్నారు.